ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు



TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

6 NEWS తెలుగు

మేడ్చల్ | శనివారం | 08.08.2026 | సంపుటి : 2 | సంచిక : 37 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు




04

మెటాకు అమెరికా కోర్టు

## భారీ షాక్

రూ.5,400 కోట్ల జరిమానా



04

అమెరికాలో

జన్మహక్కు పౌరసత్వం

## కఠినతరం

కీలక నిర్ణయం దిశగా ట్రంప్

ముందడుగు

# కోటీశ్వరులకూ రైతుబంధు ఇస్తారా?

### ఉచిత పథకాలతో ప్రమాద ఘంటికలు

ఇలాగైతే ప్రభుత్వ నిర్వహణ ఎలా?

భవిష్యత్తులో పిల్లలకు ఏం మిగులుతుంది

కుబేరుడూ కూడా కూలికి వెళ్తాడు

తెలంగాణలో 1.03 కోట్ల కుటుంబాలకు ఉచిత పథకాలు

ఉచిత పథకాలపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఉచిత పథకాల అమలులో అర్హుల ఎంపిక, ప్రభుత్వాల బాధ్యతపై కోర్టు పలు ప్రశ్నలు లేవనెత్తింది. శుక్రవారం ఒక కేసు విచారణ సందర్భంగా.. కోటీశ్వరులు కూడా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందుతున్నారని వ్యాఖ్యానించింది. రైతుల కోసం అమలు చేసిన రైతుబంధు వంటి పథకాలలోనూ సంపన్నులు లబ్ధి పొందిన విషయాన్ని కోర్టు ప్రస్తావించింది. నిజంగా అవసరం ఉన్నవారికి ప్రభుత్వ సాయం అందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. అలాగే ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉచిత పథకాలపై హైకోర్టు కీలక ప్రశ్నలు సంధించింది. భవిష్యత్ తరాలకు ప్రభుత్వాలు ఏం మిగులుస్తున్నాయో ఆలోచించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది.




హైదరాబాద్, ఆగస్ట్7: ఉచిత పథకాలతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయంటూ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఇన్ని ఉచిత పథకాలు అమలు చేస్తూ పోతే కుబేరుడైనా పనికి ఆహారం వంటి పథకం కింద కూలి పనికి వెళ్తాడని... ఆ ఖాతా పేరూ 'కుబేర' అని వ్యాఖ్యానించింది. కంటోన్మెంట్ బోర్డుకు రూ.33.42 కోట్లు విడుదల చేయాలని 2024లో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలంటూ ఇచ్చిన వినతిపత్రాలపై చర్యలు తీసుకోకపోవడంతో కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు జె.రామకృష్ణ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక -మిగతా 2 లో..



## కృత్రిమ మేధతో జీఎస్టీ లోపాలకు అడ్డుకట్ట

సీఎం రేవంత్‌రెడ్డితో భేటీలో ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగుపరచడంపై సుదీర్ఘ చర్చ

ఆదాయ పెంపు మార్గాలపై సీఎం, అధికారులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

హైదరాబాద్, ఆగస్ట్7: రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో కృత్రిమ మేధ (ఏఐ)ని ఉపయోగించడం ద్వారా ఖజానాకు మరింత ఊతం తీసుకురావచ్చని ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్ సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగుపర్చేందుకు ఏఐ ఆధారిత సమాచారంతో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) రాబడులను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లేలా సులభతర వ్యవస్థను తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ)లోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో -మిగతా 2 లో..



-మిగతా 2 లో..

### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74



02

## చిన్న కాంట్రాక్టర్లపై భారీ పెనాల్టీలు సరికాదు

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

మైనింగ్ సమస్యలపై మంత్రి వివేక్‌తో కలిసి సమీక్ష

హైదరాబాద్: రోడ్ల నిర్మాణ పనులు చేస్తున్న చిన్న కాంట్రాక్టర్లను మైనింగ్ నిబంధనల పేరిట భారీ పెనాల్టీలు విధించి వేధించడం సరికాదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. రూ.5 కోట్ల విలువ చేసే పనికి రూ.54 కోట్ల పెనాల్టీ విధించడం దుర్మార్గమన్నారు. మంత్రులు -మిగతా 2 లో..

## తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ లక్ష్యం

ఒంటరి పోరాటంతోనూ అధికారం సాధిస్తాం

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్ట్ 7 : తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ టార్గెట్ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. అధికారం చేపట్టే విషయంలో ఎవరితోనూ పొత్తు ఉండదని పేర్కొన్నారు. తెలంగాణలో జనసేనతో సహా ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని ఆయన తేల్చి చెప్పారు. అయితే, ఎన్డీయే కూటమిలో జనసేన పార్టీ భాగస్వామి అని, దానిపై జాతీయస్థాయిలోనే నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు -మిగతా 2 లో..





## మహిళపై సామూహిక అత్యాచారం

ఆపై ఫోన్‌లో వీడియోలతో బెదిరింపులు

దుండగులను రిమాండ్‌కు తరలించిన పోలీసులు

జగిత్యాల జిల్లాలో దారుణ ఘటన

02

## చేనేత సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

పీపుల్స్ ప్లాజాలో చేనేత ప్రదర్శన ప్రారంభం

మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి



హైదరాబాద్, ఆగస్ట్ 7 : చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా చేనేత స్టాల్స్ ప్రారంభించినట్లు తెలిపారు. ఆగస్టు 7 నుంచి 16 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన కొనసాగుతుందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరిస్తామని -మిగతా 2 లో..



## వర్షాల కోసం వరుణయాగం

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో యాగం

పూర్ణాహుతిలో పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్ట్ 7 : రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు, జలాశయాలు జలకళ సంతరించుకోవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆగస్టు 10వ తేదీన ఉమ్మడి నల్గొండ

## నీటిపారుదల సలహా మండళ్లను పునరుద్ధరించాలి

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

మంత్రులు ఉత్తమ్, తుమ్మల, జూపల్లి ఉన్నతస్థాయి సమీక్ష

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు జిల్లా నీటిపారుదల సలహా మండళ్లను తక్షణమే పునరుద్ధరించాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అటవీశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి మంత్రి ఉత్తమ్ శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.



హైదరాబాద్, ఆగస్ట్ 7 : ప్రతి పంట కాలానికి ముందు, పంట సీజన్‌లో ఈ మండళ్ల తప్పనిసరిగా సమావేశం కావాలని సూచించారు. జలాశయాల్లో నీటి నిల్వలు, భవిష్యత్ నీటి ప్రవాహాలు, స్థానిక వర్షపాతం, తాగునీటి అవసరాలు, ఆయకట్టు పరిస్థితులను సమీక్షించి ఏయే పంటలు వేయాలో రైతులకు శాస్త్రీయ సూచనలు ఇవ్వాలన్నారు. శనివారం నుంచే సలహా మండళ్ల సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాజెక్టుల -మిగతా 2 లో..



## కృత్రిమ మేధతో జీఎస్టీ లోపాలకు అడ్డుకట్ట

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం సాయంత్రం అరవింద్ సుబ్రమణియన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతంపై ఇరువురూ సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం జీఎస్టీ, ఎక్సైజ్ శాఖలకు సంబంధించి ఆదాయ పెంపునకు ఉన్న మార్గాలు, ఇరు శాఖల్లో చేపట్టాల్సిన సంస్కరణలు, ఏఐతో వ్యవస్థలను పటిష్టం చేసుకునే అంశాలపై అరవింద్ సుబ్రమణియన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా అరవింద్ సుబ్రమణియన్ మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీతో జీఎస్టీ వ్యవస్థలో లోపాలకు అడ్డుకట్ట వేసేందుకు, పన్ను లీకేజీలను అరికట్టేందుకు ప్రభుత్వ శాఖల మధ్య మరింత సమన్వయం అవసరమని సూచించారు. రాష్ట్ర ఖజానాకు రాబడి పెంచుతూనే సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) మెరుగుపరిచేలా టెక్నాలజీని వినియోగించాలని వివరించారు. ప్రధానంగా భవన నిర్మాణ సామగ్రి విషయంలో లీకేజీలను అరికట్టే విధంగా మున్సిపల్, రెరా, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖల మధ్య ఏఐ సాయంతో సమన్వయం అవసరమన్నారు. భారీ భవనాలు, కాంట్రాక్టు పనులకు సంబంధించిన అనుమతుల దరఖాస్తు దశలోనే నిర్మాణ సామగ్రి అవసరాలను, అందుకు అనుగుణంగా పన్నుల అంచనాలను నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ జీఎస్టీలో ఏఐ వినియోగం ద్వారా వ్యాపారాలకు ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు కలగకుండా ఉండాలని సూచించారు. ఈ డేటాతోపాటు మీ--సేవ, ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ వివరాలను కూడా సమీకృతం చేయడం ద్వారా పరిపాలనకు ఉపయోగపడేలా చూడాలన్నారు. ఈ భేటీలో సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఎక్సైజ్ కమిషనర్ సి.హెచ్. హరికిరణ్, ముఖ్య పౌరసంబంధాల అధికారి (సీపీఆర్‌వో) గుర్రం మల్సూర్ పాల్గొన్నారు. ఎక్సైజ్‌లో కీలక సంస్కరణల కోసం సూచన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో భాగంగా ఎక్సైజ్ శాఖలో తీసుకురావాల్సిన కీలక సంస్కరణల గురించి అరవింద్ సుబ్రమణియన్ పలు సూచనలు చేశారు. ముఖ్యంగా బార్ అండ్ రెస్టారెంట్లలో విక్రయించే లిక్కర్‌పై వ్యాట్ విధించాలని (తద్వారా బార్లలో విక్రయించే లిక్కర్ ధరలు పెరుగుతాయి), బార్లు పెట్టుకోవడానికి ఆసక్తి ఉన్న వారు, సరఫరాదారులు, అన్ని రకాల బ్రాండ్‌లు తెలంగాణ మార్కెట్‌లోకి సులభంగా ప్రవేశించేలా నిబంధనల్లో మార్పులు తేవాలని సూచించారు. అలాగే లిక్కర్ ధరల నిర్ధారణ (పెంచడం లేదా తగ్గించడం) విధానం కూడా సులభతరంగా ఉండాలని.. ఎప్పటికప్పుడు లిక్కర్ సరఫరాదారులకు చెల్లింపులు జరపాలని సూచించారు. రాష్ట్ర బడ్జెట్‌తో పోలిస్తే దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణలో ఎక్కువగా ఎక్సైజ్ ఆదాయం ఉంటోందని.. అయితే క్రమంగా ఇతర రాష్ట్రాల్లో ఇది పెరుగుతోందని చెప్పారు. అదే సమయంలో జీఎస్‌డీపీ, సొంత పన్నుల ఆదాయంతో పోలిస్తే ఎక్సైజ్ ఆదాయం క్రమంగా తెలంగాణలో తగ్గుతోందని సీఎం రేవంత్, అధికారులకు అరవింద్ సుబ్రమణియన్ వివరించారు.

## వర్షాల కోసం వరుణయాగం

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ యాగం వైభవంగా జరగనుంది. ఎల్ నినో ప్రభావం నుంచి విముక్తి కలిగి, కృష్ణా-గోదావరి నదులతో పాటు రైతాంగం సుభిక్షంగా ఉండాలనే ప్రత్యేక సంకల్పంతో ఈ మహా క్రతువును చేపడుతున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులతో పాటు మొత్తం 108 మంది రుత్వికులు 11 హోమకుండాలలో ఈ యాగాన్ని నిర్వహించనున్నారు. యాగ పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ మహా వరుణ యాగాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారని యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి చైర్మన్ తెలిపారు.



## చిన్న కాంట్రాక్టర్లపై భారీ పెనాల్టీలు సరికాదు

(మొదటిపేజీ తరువాయి)

వివేక్ వెంకట స్వామి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం సచివాలయంలో మైనింగ్ విభాగంపై సమీక్షించారు. మైనింగ్ విభాగానికి సంబంధించిన సమస్యలు, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఈ సమీక్షలో చర్చించారు. ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, టీజీఎండీసీ ఎండీ అనుదీప్ దురిశెట్టి, రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ బీవీ రావు, మైనింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్న చిన్న కాంట్రాక్టర్లపై భారీగా పెనాల్టీలు విధించడం, మెటల్ పర్మిషన్ల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులు, నిర్మాణ సామగ్రి లభ్యతలో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. మైనింగ్ అధికారుల వేధింపుల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆత్మహత్యకు కారణమైన అధికారిపై చర్య లు తీసుకోవాలని మంత్రి కోరారు. హ్యామ్ రోడ్ల కోసం గ్రీన్ చానల్: హ్యామ్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన అనుమతులు వేగంగా వచ్చేలా గ్రీన్ చానల్ ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి కోమటిరెడ్డి ఆదేశించారు.

# కోటీశ్వరులకూ రైతుబంధు ఇస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం విచారణ చేపట్టారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా వ్యక్తిగతంగా హాజరై రూ.24 కోట్లు గత మే నెలలో చెల్లించామని, మిగిలినది వాయిదాల పద్ధతిలో ఆరు నెలల్లో చెల్లిస్తామని చెప్పారు. ఈ దశలో పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చి రెండేళ్లయినా సొమ్ము చెల్లించలేదన్నారు. ఈ దశలో న్యాయమూర్తి స్పందిస్తూ "అధికారులు ఏం చేయగలరు? మనకు వచ్చే ఆదాయమెంత. ఖర్చెంత? రాష్ట్ర బడ్జెట్‌లో జీతాలు, అప్పులకూ పోను.. మిగిలినదంతా సంక్షేమ పథకాలకే వెచ్చించే పరిస్థితి. లబ్ధిదారులు బైక్, ఐఫోన్‌తో ఉచిత బియ్యం కోసం వెళుతున్నారు. కోటీశ్వరులకూ రైతుబంధు ఇవ్వడమేంటి? ప్రభుత్వంపై ఎంత భారం పడుతోంది? భవిష్యత్తులో పిల్లలకు ఏం మిగులుతుంది" అని ప్రశ్నించారు.




### ఒక్క తెల్లకార్డునైనా తొలగించగలరా?

రాష్ట్రంలో ఇన్ని ఉచిత పథకాల అమలుపై న్యాయమూర్తి ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ.. "ఒక తెల్లకార్డునైనా తొలగించగలరా? అలా తొలగిస్తే అదో రాజకీయమవుతుంది. ప్రభుత్వ శాఖాపరమైన వ్యవహారాల్లో ఒక్కో అధికారిపై 3 నుంచి 4 వేల కేసులున్నాయి. ప్రస్తుత అధికారిపై 100కు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏ అధికారైనా ఏమీ చేయలేరు. రేపు మీరే ముఖ్యమంత్రి అయినా ఏమీ చేయలేని పరిస్థితి. ఇది రాజకీయ ఉపన్యాసం కాదు. ఆవేదనతో చెబుతున్నా. అప్పులు తీర్చడానికి ప్రభుత్వ భూములను విక్రయిస్తుంటే భవిష్యత్తు తరాల పరిస్థితి ఏమిటి?

### 1.03 కోట్ల కుటుంబాలకు ఉచిత పథకాలు

అప్పు చేసి ఎవరైనా బెంజ్ కారు కొంటారా, ఎర్రబస్సులో వెళ్లే వాళ్లం.. ఎయిర్‌బస్‌లో వెళతామంటే ఆ కుటుంబం ఎంత కాలం నిలబడుతుంది? రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలుంటే 1.03 కోట్ల కుటుంబాలకు ఉచిత పథకాలు అందిస్తున్నారు. ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఇది దీర్ఘకాలం ఆచరణ సాధ్యం కాదు. సమాజం ప్రమాదంలో పడబోతోంది. ఇవన్నీ ఎంతవరకు సాధ్యమో ప్రభుత్వాలే తెలుసుకోవాలి" అని న్యాయమూర్తి అన్నారు. ప్రస్తుత కేసులో చెల్లింపులకు సంబంధించి అఫిడవిట్ దాఖలు చేయాలని చెబుతూ విచారణను 19కి వాయిదా వేశారు.

## మహిళపై సామూహిక అత్యాచారం

- ఆపై ఫోన్‌లో వీడియోలతో బెదిరింపులు
- దుండగులను అరెస్ట్ చేసిన రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- జగిత్యాల జిల్లాలో దారుణ ఘటన




**జగిత్యాల,ఆగస్ట్7:** జగిత్యాల జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. మల్యాల మండలం నూకపల్లి శివారులోని డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలో ఇద్దరు వ్యక్తులు ఓ మహిళపై సామూహిక అత్యాచారం చేసి బాధితురాలిని వీడియో తీసి బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో నిందితులతో పాటు వారికి సహకరించిన మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి శుక్రవారం సాయంత్రం న్యాయస్థానం ఎదుట హాజరు పరిచినట్లు మల్యాల సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఈనెల 3న నిజామాబాద్‌కు చెందిన ఓ మహిళ నూకపల్లి శివారులోని రెండు పడకగదుల ఇళ్ల కాలనీలో తనకు తెలిసినవారి ఇంటికి వచ్చింది. మల్యాల మండలం రాజారం గ్రామానికి చెందిన శివరాత్రి నరేశ్, గుర్రం శ్రీకాంత్ అనే యువకులు సదరు మహిళ ఉన్న ఇంట్లోకి ప్రవేశించి.. ఆమె తనకు సన్నిహితంగా వున్న ఓ వ్యక్తితో కలిసివున్న దృశ్యాలను తమ ఫోన్‌లో చిత్రీకరించారు. తర్వాత ఆమెపై వారిరువురు సామూహిక అత్యాచారానికి దాడికి పాల్పడ్డారు. ఆ సమయంలో జగిత్యాల జిల్లా ధరూర్ గ్రామానికి చెందిన మారవేని మల్లేశ్, రాజారం గ్రామానికి చెందిన గుర్రం అంజయ్య నిందితులకు సహకరించారు. అనంతరం నరేశ్, శ్రీకాంత్ బాధిత మహిళకు ఫోన్ చేసి తాము తీసిన వీడియోను పలువురికి పంపిస్తామని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడంతో గురువారం బాధితురాలు మల్యాల ఠాణాలో ఫిర్యాదు చేసింది. దీంతో నిందితులను అరెస్టు చేసి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ వివరించారు. నిందితులు వినియోగించిన ఇన్నోవా క్రిస్టా కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో ఏ-1 నిందితుడు శివరాత్రి నరేశ్‌పై 13, ఏ-2 నిందితుడు గుర్రం శ్రీకాంత్‌పై 9 పాత కేసులతో పాటు రౌడీ షీట్లు ఉన్నట్లు వివరించారు. ఏ-3 నిందితుడు మారవేని మల్లేశ్‌పై 2, గుర్రం అంజయ్యపై ఒక కేసు గతంలో నమోదై ఉన్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళలపై వేధింపులు, లైంగిక దాడులు, సామాజిక మాధ్యమాల ద్వారా బెదిరింపులకు పాల్పడే వ్యక్తులపట్ల చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రాజ్‌కుమార్ హెచ్చరించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్థుల కదలికలపై కూడా ప్రత్యేక నిఘావేస్తామని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో సీఐతోపాటు ఎస్సై సందీప్, పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



## చేనేత సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, వారసత్వానికి చేనేత ప్రతీకన్నారు. గద్వాల, పోచంపల్లి, నారాయణపేట చేనేతకు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉందని మంత్రి తెలిపారు. చేనేత కార్మికుల జియో ట్యాగింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. ఎఎఊఃు ద్వారా యువతకు ఆధునిక చేనేత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 'నేతన్న భరోసా' కింద ఏడాదికి రూ.18 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నామని, 'నేతన్నకు భద్రత' పథకంలో రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. చేనేత రుణమాఫీకి రూ.49.27 కోట్లు విడుదల చేశామన్నారు. చేనేత రంగానికి మొత్తం రూ.980 కోట్లు ప్రభుత్వ విడుదల చేసినట్లు చెప్పారు. వేములవాడ యార్న్ డిపో ద్వారా 3096 మెట్రిక్ టన్నుల నూలు సరఫరా అవుతోందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహిస్తామన్నారు. రైతన్నకు, నేతన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

రాంచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీజేపీ బలోపేతంపై కీలకంగా చర్చించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించారు. సంస్థాగత విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపైనా చర్చ జరిగింది. అనంతరం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. సందర్భంగా తెలంగాణ బీజేపీ చీఫ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారం కోసం రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. 937 మండలాల్లో పార్టీని బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీదే గెలుపని, కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ తరహాలో ఇక్కడా విజయం సాధించి అధికారం చేపడతామన్నారు. రాష్ట్రంలోని కీలక నేతలంతా బీజేపీలో చేరేందుకు సమయం కోసం వేచి చూస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, భేదాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని రాంచందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో



అవినీతి పెరిగిపోయిందని, కలిసి పోరాటం చేయాలని నితిన్ నబీన్ దిశానిర్దేశర చేశారని చెప్పుకొచ్చారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని రాంచందర్ రావు తెలిపారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి నితిన్ నబీన్.. రాష్ట్రానికి వస్తారని, ఇక్కడి నేతలతో సమావేశమై దిశానిర్దేశర చేస్తారన్నారు. ప్రజా సమస్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతామని ఈ సందర్భంగా ఆయన తేల్చి చెప్పారు. కాగా, ఈ సమావేశంలో సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ వంటి నేతలు కూడా పాల్గొన్నారు.



## నీటిపారుదల సలహా మండళ్లను పునరుద్ధరించాలి

(మొదటిపేజీ తరువాయి)

కింద వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలను రైతులు సాగు చేయవద్దని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఒకసారి నీరు అందినా పంటల తర్వాతి దశలో నీరు అందించడంపై అనిశ్చితి నెలకొందని.. అందువల్ల ప్రతి ఆయకట్టులో ఎంత సాగునీరు అందించగలమో, ఎక్కడ నీటి పరిమితులు ఉన్నాయో కలెక్టర్లు, అధికారులు రైతులకు ముందే తెలియజేయాలని ఆదేశించారు. నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఆశించిన స్థాయికి చేరుకోనందున ఆయా ఆయకట్టు ప్రాంతాల్లో తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. వచ్చే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే అవసరమైన నీటి నిల్వలను పరిరక్షించాలని గ్రామీణ నీటిసరఫరా శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు.

# కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ షురూ

## ప్రథమ ప్రాధాన్యం తలసేమియా, సికిల్‌సెల్ అనీమియా బాధితులకు...

**హైదరాబాద్:** రాష్ట్రంలోని తలసేమియా, సికిల్‌సెల్ అనీమియా బాధితులు, దివ్యాంగులు చనిపోయినప్పుడు వారి భర్త /భార్యకు వెంటనే సామాజిక భద్రత పింఛన్ల మంజూరుకు చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లను ప్రభుత్వం ఆదేశించినట్టు సమాచారం. శుక్రవారం పీఆర్‌ఆర్‌డీలోని డీఆర్‌డీఓలు, మున్సిపల్‌శాఖలోని మున్సిపల్ కమిషనర్లతో సెర్ప్ సీఈఓ, మెప్మా ఇన్‌చార్జ్ దివ్యదేవరాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. దీనికి సంబంధించి సంబంధిత అధికారులకు ఇందుకు అవసరమైన ఆదేశాలు జారీచేసినట్టు సమాచారం. సెర్ప్ రికార్డుల ప్రకారం ఇప్పటికే ప్రాథమికంగా 1,599 మంది తలసేమియా బాధితులను గుర్తించి సర్టిఫికెట్లు ఇచ్చారు. మిగిలిన అర్హులైన బాధితులు కూడా వైద్య ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలో దాదాపు 6 వేల తలసేమియా, 1,700 సికిల్‌సెల్ అనీమియా బాధితులున్నట్టు ప్రాథమికంగా అధికారులు గుర్తించినట్టు తెలిసింది. ఆగస్టు 15 నుంచి కొత్తగా రెండున్నర లక్షల చేయూత పింఛన్ల మంజూరుకు పీఆర్‌ఆర్‌డీ కసరత్తు ప్రారంభించింది. వీరిలోనూ వృద్ధులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఏ ప్రాతిపదికన ఏ కేటగిరీలో ఎంత మందికి కొత్త పింఛన్లు మంజూరు చేయాలనే దానిపైనా అధికారుల్లోనూ సందిగ్ధత నెలకొంది.



# చిన్నతరహా పరిశ్రమలకు పెద్దపీట

- చేతివృత్తులు, రైతులకు మార్కెట్ అవకాశాలు
- బ్రిక్స్ మంత్రుల సమావేశంలో నిర్ణయం
- కేంద్రమంత్రి పీయూష్ గోయల్

**జైపూర్, ఆగస్ట్ 7:** దేశంలోని చిన్న తరహా పరిశ్రమలు, చేతివృత్తుల కళాకారులు, రైతులు, మత్స్యకారుల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు పెంచేందుకు వీలుగా కేంద్రం సరికొత్త చర్యలు తీసుకుంది. ఇందుకోసం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను సవరించినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. జైపూర్‌లో జరిగిన 'బ్రిక్స్' వాణిజ్య, పరిశ్రమల మంత్రుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ-కామర్స్ ద్వారా అంతర్జాతీయ లబ్ధి: హ్యాండ్‌లూమ్స్, హస్తకళలు, టెక్స్‌టైల్స్, పాదరక్షలు, ఆహార ఉత్పత్తులను పెద్ద ఎత్తున ఈ-కామర్స్ వేదికల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేందుకు నిబంధనలను సరళీకృతం చేశారు. భారతదేశంలోని గ్రామీణ కళాకారులు, ఎంఎస్ఎంఈలు , రైతులకు ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లను అందుబాటులోకి తేవడమే లక్ష్యమని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బ్రిక్స్ దేశాల్లో పెట్టుబడులు, కొత్త ఉద్యోగ అవకాశాలు సృష్టించడంపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. సభ్య దేశాల మధ్య వాణిజ్య ప్రక్రియను మరింత డిజిటలైజ్ చేయడం, కాగిత రహిత ప్రక్రియగా మార్చడం, ఓ÷ూఓఇలకు అవసరమైన ఆర్థిక సాయం వేగంగా అందించడంపై నిర్ణయాలు తీసుకున్నారు. కాగా, బ్రిక్స్ కూటమికి కామన్ కరెన్సీ ఏర్పాటు చేసే ఆలోచనకు భారతదేశం మద్దతు ఇవ్వడం లేదని ఈ సందర్భంగా పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. జాతీయ చేనేత దినోత్సవం (ఆగస్టు 7) సందర్భంగా తీసుకున్న ఈ నిర్ణయం ఖాదీ, కుటీర పరిశ్రమలు,



తోలు రంగానికి చెందిన కళాకారులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ట్రంప్ ఒత్తిడితోనే 'ఈ20' పాలసీ

### కేజ్రీవాల్ ఆరోపణలు

**న్యూఢిల్లీ:** అమెరికా నుంచి ఇథనాల్ దిగుమతులను సులభతరం చేసేందుకే ఈ20 పాలసీని కేంద్రం అమలు చేస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. మౌలిక సదు-పాయాలను మెరుగుపరచకుండా, ఇప్పటికే ఉన్న వాహనాలు ఈ20కి అనుకూలంగా ఉన్నాయా? లేదా? అని నిర్ధరించుకోకుండా ప్రభుత్వం ఈ విధానాన్ని బలవంతంగా తీసుకొచ్చిందన్నారు. దిల్లీలో మీడియాతో కేజ్రీవాల్ మాట్లాడారు. "అమెరికా అధ్యక్షుడి ఒత్తిడిని నరేంద్ర మోదీ ప్రభుత్వం తట్టుకోలేక పోతోంది. ఇథనాల్‌ను అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న దేశం అమెరికా. కానీ, దానిని పూర్తి స్థాయిలో వినియోగించుకోలేక పోతోంది. ఆ ఇథనాల్‌కు డిమాండ్ సృష్టించేందుకు భారత్ ఈ20ని బలవంతంగా అమలు చేస్తోంది" అని కేజ్రీవాల్ ఆరోపించారు. గతేడాది అమెరికా నుంచి భారత్ 100 కోట్ల లీటర్ల ఇథనాల్‌ను దిగుమతి చేసుకోగా, ఈ ఏడాది 500 కోట్ల లీటర్లను దిగుమతి చేసుకోనుందని చెప్పారు. అసలు అమెరికానే దేశవ్యాప్తంగా ఈ20ని అమలు చేయలేదని, చాలా వరకు తక్కువ ఇథనాల్ మిశ్రమాన్నే కొనసాగిస్తోందన్నారు. భారత్‌లో ఈ విధానాన్ని ప్రకటించిన తర్వాత, దీనిని అమలు చేసేందుకు మూడేళ్ల గడువు మాత్రమే ఇచ్చిందన్నారు. మౌలిక సదుపాయాలు, లక్షలాది వాహనాలను దీనికి అనుగుణంగా మార్చేందుకు ఈ గడువు సరిపోదన్నారు.

## సోషల్ మీడియా ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టలేరు

### బీఆర్ఎస్ నేతలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



**న్యూఢిల్లీ, ఆగస్టు 07 :** సోషల్ మీడియాలో ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టలేరని బీఆర్ఎస్ నేతలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో వరుస ఓటములపై ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఆ పార్టీ నేతలకు సూచించారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిపై జరుగుతున్న ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ ప్రచారంపై ప్రతి కాంగ్రెస్ నేతకు బాధ్యత ఉందని అన్నారు. జిల్లా, మండల స్థాయిలో స్పోక్స్ పర్సన్లను నియమిస్తామని తెలిపారు. మండల అధ్యక్షులు వారానికి ఓ సారి ప్రెస్ మీట్ పెట్టాలని వారిని ఆదేశించారు.

## ఐఏఎస్ సందీప్ కేసు విచారణలో తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, ఆగస్టు 7 :** కోర్ట్ ధిక్కరణ వ్యవహారంలో తెలంగాణ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా హైకోర్టు ముందు వ్యక్తిగతంగా విచారణకు హాజరయ్యారు. కేసు విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సందీప్ సుల్తానియాపై వెయ్యి కేసులు ఉన్నాయని.. అవన్నీ విచారణ చేస్తే జీవిత కాలం జైల్లో ఉండాలని పేర్కొంది. ప్రభుత్వాలు చేసిన తప్పుకు అధికారులకు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. అధికారులను హైకోర్టుకు పిలిపించడం బాధగా ఉందని.. తప్పని పరిస్థితుల్లో హాజరుకావాలని ఆదేశిస్తున్నామని న్యాయస్థానం తెలిపింది. ఉచిత పథకాల వల్ల చాలా ప్రమాదం ఉందని.. రైతుబంధు అనేది సంపన్నులు, అధికారులు కూడా తీసుకుంటున్నారని.. ఇది చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసింది. రైతుబంధుతో రాష్ట్ర ఖజానాకు భారమని హైకోర్టు వ్యాఖ్యానించింది.

## టీపీసీసీ సోషల్ మీడియా చైర్మన్‌గా నవీన్ పెత్తెం

**హైదరాబాద్,ఆగస్ట్7:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)లో పలు కీలక నియామకాలు జరిగాయి. టీపీసీసీ సోషల్ మీడియా విభాగానికి నూతన ఛైర్మన్‌గా నవీన్ పెత్తెంను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) నియమించింది. అలాగే మీడియా, పబ్లిసిటీ విభాగం ఛైర్మన్‌గా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకాలకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో సోషల్ మీడియా విభాగం కోఆర్డినేటర్‌గా పనిచేసిన నవీన్ పెత్తెం, ప్రస్తుతం రాష్ట్ర రవాణా అథారిటీలో సభ్యుడిగా కూడా ఉన్నారు. ఆయనతో పాటు సోషల్ మీడియా విభాగానికి కన్వీనర్లుగా కె.ఉజ్వల్ రెడ్డి, పి.వంశీకృష్ణలను నియమించారు. అంబాల శివకుమార్, విష్ణు వర్ధన్ రెడ్డి, వీరాపురం రామ్ లక్ష్మణ్, గీత అయినాల, ఎండీ అబిద్ అలీ, సుశీల్ కుమార్‌లను కోఆర్డినేటర్లుగా ఎంపిక చేశారు. అయితే, సోషల్ మీడియా విభాగం కోఆర్డినేటర్ పదవిని స్వీకరించేందుకు గీత అయినాల నిరాకరించారు. ప్రస్తుతం టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్స్ కన్వీనర్‌గా ఉన్న ఆమె, ఈ నియామకం పట్ల ధన్యవాదాలు తెలుపుతూనే, ఈ పదవిని తాను స్వీకరించడం లేదని 'ఎక్స్' ద్వారా ప్రకటించారు. తన పేరును జాబితా నుంచి తొలగించాలని నవీన్ పెత్తెంను కోరారు. ఆమె నిరాకరణకు గల కారణాలు వెంటనే తెలియరాలేదు. మరోవైపు, నవీన్ పెత్తెం నియామకంపై భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మద్దతుదారులు విమర్శలు గుప్పించారు. కొత్త బాధ్యతలపై ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ.. తనకు ఈ అవకాశం కల్పించిన ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ వాణిని తెలంగాణ అంతటా బలంగా వినిపిస్తానని ఆయన పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కొత్త క్లౌడ్ రీజియన్

### ఏఐ సేవలకు మరింత ఊతం

**హైదరాబాద్,ఆగస్ట్7:** ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్, భారత్‌లో తన క్లౌడ్ సేవలను మరింత విస్తరించింది. హైదరాబాద్ కేంద్రంగా "ఇండియా సౌత్ సెంట్రల్" పేరుతో తన నూతన క్లౌడ్ రీజియన్‌ను ప్రారంభించింది. ఈ కొత్త కేంద్రం ఏర్పాటుతో దేశంలో మైక్రోసాఫ్ట్ క్లౌడ్ రీజియన్ల సంఖ్య నాలుగుకు చేరుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఎంటర్‌ప్రైజ్ సేవలకు అవసరమైన మౌలిక సదు-పాయాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ వెల్లడించింది. తెలంగాణలో ఏర్పాటైన ఈ నూతన రీజియన్ ద్వారా వినియోగదారులు తమ డేటాను స్థానికంగానే భద్రపరుచుకోవచ్చు. దీనివల్ల అత్యున్నత భద్రతతో పాటు వేగవంతమైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే పూణె, చెన్నై, ముంబై నగరాల్లో మైక్రోసాఫ్ట్‌కు క్లౌడ్ రీజియన్లు ఉండగా, తాజా విస్తరణతో భారత్‌లో అతిపెద్ద హైపర్‌స్కేల్ క్లౌడ్ నెట్‌వర్క్ కలిగిన సంస్థగా మైక్రోసాఫ్ట్ నిలిచింది. సేవల్లో ఎలాంటి అంతరాయాలు కలగకుండా ఉండేందుకు వీలుగా ఈ కేంద్రంలో మూడు అవైలబిలిటీ జోన్‌లను ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా, 2030 నాటికి నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించే లక్ష్యంతో ఇందులో "జీరో-వాటర్ కూలింగ్" సాంకేతికతను వినియోగిస్తున్నారు. అదానీ గ్రూప్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పీబీ పే వంటి ప్రముఖ భారతీయ సంస్థలు ఇప్పటికే ఈ హైదరాబాద్ రీజియన్ సేవలను వినియోగించుకుంటున్నాయి. భారత్‌లో డిజిటల్, ఏఐ మౌలిక సదుపాయాల కోసం మైక్రోసాఫ్ట్ ప్రకటించిన 20.5 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులలో భాగంగా ఈ నూతన రీజియన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ మాట్లాడుతూ, ఏఐ సాంకేతికతతో విలువైన ఫలితాలను సాధించాలంటే, డేటాకు సమీపంలో నమ్మకమైన మౌలిక సదుపాయాలు ఉండటం అత్యంత కీలకమని పేర్కొన్నారు.

# విచారణకు సహకరించని ట్రైనీ ఐపిఎస్

### మరోమారు కస్టడీ కోరిన పోలీసులు

**హైదరాబాద్, ఆగస్ట్ 7 :** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి రెండు రోజుల పోలీసు కస్టడీ ముగిసింది. లైంగిక వేధింపుల కేసు విచారణ సందర్భంగా కస్టడీలో కృష్ణారెడ్డి నోరు మెదపలేదని తెలుస్తోంది. పోలీసులు అడిగిన చాలా ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పేందుకు నిరాకరించినట్లు సమాచారం. దీంతో మరోసారి కస్టడీకి కోరుతూ ఉప్పర్‌పల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. విచారణకు కృష్ణారెడ్డి సహకరించలేదని, మరికొన్ని కీలక విషయాలు తెలుసుకునేందుకు నిందితుడిని కస్టడీకి అప్పగించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం నాడు కోర్టులో ఈ పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం ఉంది. కాగా, సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమిలో మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపులు, దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై కృష్ణారెడ్డిపై కేసులు నమోదు అయ్యాయి. అత్తాపూర్ పోలీసులు ఆయనపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. విచారణలో భాగంగా కృష్ణారెడ్డిని తమకు రెండు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఉప్పర్‌పల్లి కోర్టులో పోలీసులు ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గత బుధవారం కస్టడీకి అనుమతించింది. కోర్టు ఆదేశాల మేరకు గురు, శుక్రవారాల్లో అత్తాపూర్ పోలీస్ స్టేషన్, ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారుల పర్యవేక్షణలో



విచారణ జరిగింది. అయితే, కృష్ణారెడ్డి సహకరించకపోవడంతో పోలీసులు మరోసారి కోర్టును ఆశ్రయించారు.

## విడాకుల కేసు వెనక్కి తీసుకున్న సీఎం విజయ్ సతీమణి

**చెన్నై:** తమిళనాడు సీఎం విజయ్ విడాకుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. విజయ్ నుంచి విడాకులు కోరుతూ కోర్టులో వేసిన పిటిషన్‌ను ఆయన భార్య సంగీత వెనక్కి తీసుకున్నారు. నేడు ఈ కేసు విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన సంగీత.. తన కేసును కొనసాగించకపోవడానికి గల కారణాలను న్యాయస్థానానికి వివరించారు. దీంతో ఈ కేసును ముగిస్తున్నట్లు చెంగల్‌పట్టు జిల్లా కోర్టు ప్రకటించింది. అవసరమైతే భవిష్యత్తులో కొత్త పిటిషన్‌ను దాఖలు చేసే స్వేచ్ఛను ఆమెకు కల్పించింది. విజయ్‌పై పలు ఆరోపణలు చేస్తూ ఆయన సతీమణి సంగీత విడాకులు కోరుతూ ఫిబ్రవరిలో చెంగల్‌పట్టు కోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణకు ఇరువురూ హాజరు కాకపోవడంతో కోర్టు పలుమార్లు విచారణను వాయిదా వేసింది. ఆ సందర్భాల్లో వారి తరఫు న్యాయవాదులు హాజరై.. విచారణకు ప్రత్యక్షంగా హాజరుకావడంలో నెలకొన్న ఇబ్బందులను కోర్టుకు వివరించారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ జరుగుతూ వచ్చింది. విజయ్‌కు 1999 ఆగస్టు 25న సంగీతతో వివాహం జరగ్గా.. వారికి కుమారుడు, కుమార్తె ఉన్న విషయం తెలిసిందే.

## ఎఫ్‌సీఆర్ఏ చట్ట సవరణపై యూఎస్ ప్రజాప్రతినిధి అభ్యంతరం

### స్పందించిన భారత్

**ఢిల్లీ, ఆగస్టు 7:** విదేశీ నిధుల నియంత్రణకు ఉద్దేశించిన ఎఫ్‌సీఆర్ఏ చట్టానికి భారత్ చేయనున్న సవరణలపై అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడు రైలీ మూర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. చట్టాలు, వాటి సవరణలు తమ అంతర్గత విషయాలని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అమెరికా సహా అనేక దేశాల్లో ఇలాంటి చట్టాలు ఉన్నాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ప్రజాస్వామిక పద్ధతుల్లో భారత్ చట్టాల రూపకల్పన చేస్తుందని చెప్పారు. దేశీయ చట్టాలకు వాటికంటూ ప్రత్యేక నేపథ్యం ఉంటుందని చెప్పారు. ఈ దృష్టికోణంలోనే చట్టాలను విశ్లేషించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతిపాదిత సవరణలపై రైలీ మూర్ ఇటీవల స్పందిస్తూ పలు ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ సవరణలు చట్ట రూపం దాలిస్తే యూఎస్-భారత్ ద్వైపాక్షిక బంధాలు దెబ్బతింటాయని అన్నారు. ఈ సవరణలతో మతపరమైన చారిటీ సంస్థలను భారత్ నియంత్రించే అవకాశం ఉందని హెచ్చరించారు. అయితే, విదేశీ నిధులతో దేశ సార్వభౌమత్వం, సమగ్రత, భద్రత, ప్రజాప్రయోజనాలు, ప్రజాస్వామిక సంస్థలపై ప్రతికూల ప్రభావం పడకుండా భారత్ ఎఫ్‌సీఆర్ఏ చట్టాన్ని గతంలో తీసుకొచ్చింది. ఇక విదేశీ నిధులతో నడిచే సంస్థల కార్యకలాపాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం, మెరుగైన నిర్వహణ కోసమే తాజా మార్పులను ప్రతిపాదిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వవర్గాలు తెలిపాయి.

## విద్యార్థుల ఫీజులు డిస్‌ప్లే చేయాలి

### పాఠశాలలకు ప్రభుత్వం ఆదేశం

**హైదరాబాద్, ఆగస్ట్ 7 :** విద్యార్థుల పాఠశాల ఫీజుల వివరాలపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఫీజుల వివరాలను డిస్‌ప్లే చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. పాఠశాల నోటీసు బోర్డు, వెబ్‌సైట్‌తో పాటు పాఠశాల విద్యాశాఖ పోర్టల్‌లోనూ పొందుపరచాలని స్పష్టం చేసింది. నిబంధనలు పాటించని పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని.. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫీజుల స్ట్రక్చర్ ప్రదర్శించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

## హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం

- గాజులరామారంలో 100 ఎకరాల్లో ఏర్పాటు
- ట్రాఫిక్ ను తగ్గించేందుకు ప్రభుత్వ ప్రణాళిక
- లోక్‌సభలో ధ్రువీకరించిన కేంద్రమంత్రి గడ్కరీ



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 7 :** హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగర శివారులోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి భూమి కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణం పూర్తయితే నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. జగద్గిరిగుట్ట సమీపంలో బస్ డిపో నిర్మాణం కోసం టీజీఎస్ఆర్టీసీ గతంలో హెచ్ఎంటీకి చెందిన స్థలాన్ని 99 ఏళ్ల పాటు లీజుకు కోరినట్లు తెలిపారు. అయితే, కేవలం 20 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇవ్వగలమని, అదీ ఐదేళ్లకోసారి సమీక్షిస్తామని హెచ్ఎంటీ అధికారులు చెప్పారన్నారు. దీనికి అదనంగా ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని షరతు విధించడంతో ఈ ప్రతిపాదనను టీజీఎస్ఆర్టీసీ తిరస్కరించిందని గడ్కరీ వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో హెచ్ఎంటీ భూములకు సమీపంలోనే 100 ఎకరాల స్థలాన్ని టీజీఎస్ఆర్టీసీకి కేటాయించిందని గడ్కరీ స్పష్టం చేశారు. ప్రస్తుతం జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు రోజూ 404 ట్రిప్పులు నడుపుతున్నాయని, కొత్త డిపోతో ఈ ప్రాంతంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదిత గాజులరామారం డిపోను అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సుల కోసం ప్రత్యేకంగా ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్, సిటీ బస్సుల కోసం మరో టెర్మినల్ ఏర్పాటు చేస్తారు. పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించేందుకు ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్‌ను కూడా నిర్మించనున్నారు. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులు నగరం నడిబొడ్డుకు రాకుండా ఇక్కడి నుంచే తమ సర్వీసులను నడుపుతాయి. తద్వారా ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి బస్టాండ్లపై ఒత్తిడి తగ్గి, నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించగలదని ప్రభుత్వం భావిస్తోంది.

## 15 రాష్ట్రాల్లో సైబర్ ముఠాల గుట్టురట్టు

### మొత్తం 49 మంది నిందితుల అరెస్టు

**హైదరాబాద్,ఆగస్ట్7 :** సైబర్ నేరగాళ్లపై హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. తెలంగాణ సహా 15 రాష్ట్రాల్లో విస్తరించిన సైబర్ ముఠాల గుట్టురట్టు చేశారు. మొత్తం 49 మంది నిందితులను అరెస్టు చేసి, రికవరీ చేసిన రూ.98.89లక్షల డబ్బును బాధితులకు రిఫండ్ చేశారు. జులైలో 70 సైబర్ క్రైమ్ సంబంధిత ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ట్రేడింగ్ మోసాలే అత్యధికంగా జరిగాయని.. ఆ కేసుల్లో 29 మందిని అరెస్టు చేశామని వివరించారు. మొత్తంగా 25 డెబిట్‌కార్డులు, 23 మొబైల్ ఫోన్లు, 3 ల్యాప్‌టాప్‌లు సహా కీలక వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జోనల్ సైబర్ సెల్స్ ద్వారా 298 కేసులు నమోదు కాగా.. ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. 128 నకిలీ సోషల్‌మీడియా ప్రొ÷ళ్లు, 36 నకిలీ యాడ్స్‌ను బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో వచ్చే కాల్స్ పూర్తిగా నకిలీవేనని పోలీసులు స్పష్టం చేశారు. వాటిని నమ్మొద్దని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

## వివాదాస్పద ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు

### ఉభయ సభల ఎంపీలకు కాంగ్రెస్ విప్ జారీ

**న్యూఢిల్లీ,ఆగస్ట్7:** వివాదాస్పద ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా తమ పార్టీకి చెందిన ఉభయ సభల ఎంపీలకు కాంగ్రెస్ విప్ జారీ చేసింది. ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుపై ప్రభుత్వం చర్చ చేపట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో రాజ్యసభ, లోక్‌సభ రెండింటిలోనూ కాంగ్రెస్ ఎంపీలు తప్పనిసరిగా హాజరు కావాలని అధిష్ఠానం స్పష్టం చేసింది. ఆగస్టు 10, 11, 12 తేదీల్లో తమ తమ సభల్లో తప్పనిసరిగా హాజరు కావాలని పార్లమెంటు సభ్యులను కోరింది. ఈ మేరకు రాజ్యసభలోని కాంగ్రెస్ చీఫ్ విప్ జైరామ్ రమేశ్ విప్ జారీ చేశారు. ఈ సందర్భంగా 2026 ఆగస్టు 10, 11, 12 తేదీల్లో రాజ్యసభలో చాలా ముఖ్యమైన అంశాలను చర్చకు తీసుకోనున్నట్లు జైరామ్ రమేశ్ తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి సభ వాయిదా పడే వరకు తప్పనిసరిగా సభలో సభ్యులు ఉండాలని, పార్టీ వైఖరికి మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని అత్యంత ముఖ్యమైనదిగా పరిగణించాలని కోరారు. మరోవైపు, లోక్‌సభలోని కాంగ్రెస్ సభ్యులకూ పార్టీ ఇదే విధమైన విప్ జారీ చేసింది. ఆ మూడు రోజుల పాటు కాంగ్రెస్ ఎంపీలంతా తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొంది. అదేవిధంగా ఇండియా కూటమిలోని అన్ని మిత్రపక్షాలకు ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆయా పార్టీల ఎంపీలందరూ హాజరుకావాలని కోరింది. కాగా, ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ తరుణంలో కాంగ్రెస్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే, వచ్చే వారం జరగబోయే తాత్కాలిక ప్రభుత్వ కార్యకలాపాల జాబితాను పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి వెల్లడించారు. దాంట్లో ఆ రెండు బిల్లుల గురించి మంత్రి ఎక్కడా ప్రస్తావించలేదు.

## విద్యార్థి సమస్యలపై పోరులో కాంగ్రెస్ కంటే సీజేపీదే పైచేయి: శశి థరూర్

**ముంబయి, ఆగస్ట్7:** దేశవ్యాప్తంగా కాక్రోచ్ జనతా పార్టీ లేవనెత్తిన అంశాలను కాంగ్రెస్ పార్టీ నేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇది వరకే ప్రస్తావించారని ఆ పార్టీ ఎంపీ శశిథరూర్ అన్నారు. కానీ, సీజేపీకి వచ్చిన స్థాయిలో అప్పుడు ప్రజాస్పందన రాలేదని తెలిపారు. నెల ముందే కాంగ్రెస్ పార్టీ ఈ అంశం లేవనెత్తినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని, ప్రజల నాడి పట్టుకోవడంలో ఎక్కడ విఫలమవుతున్నామో కాంగ్రెస్ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. నీట్‌లో అక్రమాలపై దిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా జూన్ 20న సీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టిన సంగతి తెలిసిందే. కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ చేపట్టిన ఉద్యమానికి ఎట్టకేలకు కేంద్రం తలొంచాల్సి వచ్చింది. వాస్తవానికి జూన్ 17నే రాజస్థాన్‌లోని కోటాలో ఛాత్రోం కీ గూంజ్ (విద్యార్థి గళం) కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ నిర్వహించారని శశిథరూర్ గుర్తు చేశారు. సీజేపీ వ్యక్తం చేసిన డిమాండ్లను రాహుల్ గాంధీ ముందుగానే ప్రస్తావించారని తెలిపారు. దేశంలో యువతకు ప్రాధాన్యం మరింతగా పెరిగిందని శశిథరూర్ అన్నారు. దక్షిణ ఆసియాలోని రాజకీయ పార్టీలు గతంలో మాదిరిగా సంప్రదాయ రాజకీయాలను కొనసాగించడం కష్టమేనని అభిప్రాయపడ్డారు.

# ప్రజాస్వామ్యానికి పట్టిన చీడను వదిలించాలి !



**ప్రజాస్వామ్యంలో పాలకులు నియంతులుగా మారుతుంటే ప్రెజర్ గ్రూప్ ఉండాల్సిందే. ప్రతిపక్షాల మాట కూడా వినకుండా పాలన చేయడం అలవాటు చేసుకున్నారు. తాము అన్నకున్న విధానంలో పాలన సాగుతోంది తప్ప, ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా సాగడం లేదు. ఇటీవల పరీక్ష పేపర్ల లీకేజీ పాలకులు నిర్లక్ష్య ధోరణికి అద్దం పట్టింది. ఈ క్రమంలో బొద్దింకల దండు ఢిల్లీపై దండయాత్ర చేయడంతో ప్రభుత్వం దిగి వచ్చింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామ చేయడం, పేపర్ లెస్ పరీక్షల కోసం నందన్ నీలుకని నేతృత్వంలో కమిటీ వేయడం వంటివన్నీ చకచకా జరిగిపోయాయి. ఇదంతా కేవలం విద్యార్థుల ఒత్తిడి మూలంగానే జరిగిందని చెప్పాలి. ఈ ఒత్తిడిని కొనసాగించాలని, దేశంలో ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తామని కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే చేసిన ప్రకటన ప్రజాస్వామ్య వ్యవస్థ గట్టిగా నిలబడడానికి తోడ్పడుతంది.**

ఈ పోరాటంలో రాజకీయ నాయకుల జోక్యం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా బొద్దింకల పార్టీదే. ఇకపోతు ఈ ఒత్తిడి కొనసాగించేలా దేశవ్యాప్తంగా 'క్యా బోలీ్త పబ్లిక్' .. అంటే ప్రజలు ఏమంటున్నారు... పేరుతో కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రజల వద్దకు తీసుకెళ్తామని దీప్కే తెలిపారు. నిజంగా ఈ ఆలోచనను స్వాగతించాల్సిందే. ప్రతి ఒక్కరూ ఈ నినాదం వెనక నిలబడాలి. ఎందుకంటే పాలకులు గతి తప్పకుండా ఉండాలంటే ఏదో ఒకచోట చెక్ పడాల్సి ఉంది. విద్యార్థి నిరసనలతో దేశం దృష్టి ఆకర్షించిన కాక్రోచ్ జనతా పార్టీ చేసిన ఈ కీలక ప్రకటన ప్రజలను ఆలోచింప చేసేదిగా ఉంది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు 'క్యా బోలీ్త పబ్లిక్' పేరిట జాతీయస్థాయి ప్రచారం నిర్వహిస్తామని వెల్లడించినందున ప్రజలు కూడా ఈ ఉద్యమాన్ని సొంతం చేసుకోవాలి. మద్దతుగా నిలవాలి.. ప్రజల ఆందోళనలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, అభిప్రాయాలను తీసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని స్పష్టం సిజెపి చేసింది. సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా పర్యటించి ప్రతి ఒక్కరితోనూ మమేకమవుతామని దీప్కే తెలిపారు. సీజేపీ ఒక రాజకీయ పార్టీగా మారకుండా ఒక ఒత్తిడి బృందంగానే కొనసాగుతుందని దీప్కే ప్రకటించారు. అంటే ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తామని చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశం లేదని, ప్రజల తరఫున ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రెషర్ గ్రూప్‌గా పనిచేయడమే తమ లక్ష్యమని కూడా దీప్కే స్పష్టం చేశారు.

దేశ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజులు, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో తగ్గుతున్న విశ్వాసం వంటి అంశాలపై ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రచారంలో విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కూడా పిలుపునిచ్చారు. ఈ రోజు మన దేశంలో సంస్థాగత జవాబుదారీతనం ప్రమాదకర స్థితిలో ఉంది. ఇది మన ప్రజాస్వామ్యానికి ఒక ప్రమాదకర సంకేతం. గతంలో ఓటర్లు ప్రభుత్వాన్ని ఎన్నుకునేవారు. ఈ రోజు ఎవరు ఓటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. ప్రజాస్వామ్యం ఇలా పనిచేయదు. మనం ఎన్నికల సంఘం జవాబుదారీతనాన్ని సరిదిద్దాలి. మనం ఇది చేసేంత వరకు దేశంలో ఎన్నికల అవకతవకలు కొనసాగుతేనే ఉంటాయి. కాబట్టి పోరాటం చేయాలన్న దీప్కే సంకల్పం అభినందనీయం. నిరుద్యోగం దేశంలో ఒక ప్రధాన సమస్యగా మారింది. దీనిపై పాలకపక్షాలు కప్పదాటు ప్రకటనలు చేస్తున్నాయి. దీనిని దేశవ్యాప్త సమస్యగా పరిగణిస్తామని దీప్కే తెలిపారు. దేశంలో నాణ్యమైన విద్య రోజురోజుకూ భారంగా మారుతోంది. వపిసరీతమైన ఫీజుల దోపిడీ సాగుతోంది. అయినా పాలకులు దృష్టి సారించడం లేదు. ఈ రంగంపై పోరాడాలన్న సంకల్పం మంచిదే.

ఈ అంశంపైనే తొలుత తాము దృష్టిసారిస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. సెప్టెంబర్ నుంచి ప్రజల్లోకి వెళ్తామని మీడియా వేదికగా తెలియజేశారు. ఒకటో తరగతికే ఫీజులు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో ఇంకా ఎక్కువే ఫీజులు ఉంటున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ఆ మొత్తాన్ని ఎలా భరిస్తాయి. ఈ ఖర్చుల వల్ల ప్రజలు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఆ భారం తగ్గాలని మా పార్టీ కోరుకుంటోంది. తల్లిదండ్రులు పిల్లలకు ఉన్నత విద్య అందించాలనుకున్నప్పుడు దానిని వారు భారంగా భావించకూడదు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చెప్పిన ప్రకారం.. విద్య ప్రాథమిక హక్కు. గత కొన్నేళ్లుగా అది ఒక వ్యాపారంగా మారిపోయింది. అన్నింటికి మించి జెన్–జీ యువత చేస్తున్న ఉద్యమాన్ని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ స్వాగతించడం విశేషం. యువత ఎదుర్కొంటున్న సమస్యలు, వారు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు సమర్థనీయమైనవేనని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు అనేవి సంభాషణకు, సమస్యల పరిష్కారానికి దోహదపడే మార్గాలని ఆయన స్పష్టం చేశారు. నేటి జెన్–జీ ప్రతి అంశానికి తార్కిక వివరణలు కోరుకుంటోందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశ్నించడం, తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, నిరసనలు తెలియజేయడం ప్రజాస్వామ్య హక్కులేనని మోహన్ భాగవత్ చెప్పుకొచ్చారు. యువత ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకుంటూ వారితో నిరంతర సంభాషణ కొనసాగించడం అవసరమని మోహన్ భాగవత్ నిర్మొహమాటంగా చెప్పారు. మొత్తంగా ప్రతి ఒక్కరూ యువత ఆలోచనలను స్వాగతిస్తున్నారు. పాలకులు కూడా కళ్లు తెరిస్తే మంచిది.

# మెటాకు అమెరికా కోర్టు భారీ షాక్

## రూ.5,400 కోట్ల జరిమానా






**న్యూఢిల్లీ, ఆగస్ట్ 7 :** సోషల్ మీడియా దిగ్గజం మెటాకు అమెరికా కోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని నిర్ధారించిన న్యూ మెక్సికో కోర్టు, కంపెనీకి 567 మిలియన్ డాలర్ల (సుమారు రూ.5,400 కోట్లకు పైగా) జరిమానా విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా రెండో దశలో జడ్జి బ్రయాన్ బీడ్‌షీడ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. తీర్పు ప్రకారం జరిమానా మొత్తంలో 420 మిలియన్ డాలర్లు సోషల్ మీడియా వల్ల ప్రభావితమైన యువతకు చికిత్సా సేవల కోసం కేటాయించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. మిగిలిన నిధులను రాబోయే ఐదేళ్లలో అవగాహన, నివారణ కార్యక్రమాలు, స్క్రీనింగ్ సేవలు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించాలని ఆదేశించింది. ఈ కేసులో గత మార్చి నెలలో వెలువడిన తీర్పునకు ఇది కొనసాగింపు కావడం గమనార్హం. ఆ సమయంలో మెటా ఉద్దేశపూర్వకంగానే పిల్లల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించిందని, లైంగిక దోపిడీకి సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టిందని నిర్ధారించిన జ్యూరీ, కంపెనీకి 375 మిలియన్ డాలర్ల సివిల్ పెనాల్టీ విధించింది. ఈ కేసు విచారణలో ప్రాసిక్యూటర్లు మెటా ప్లాట్‌ఫామ్‌లలో కీలక మార్పులు చేయాలని కోరారు. ముఖ్యంగా యువతను వ్యసనపరులుగా మార్చే ఫీచర్లను నియంత్రించాలని, వయసు నిర్ధారణ పద్ధతులను కఠినతరం చేయాలని, పిల్లల లైంగిక దోపిడీని అరికట్టేందుకు డిఫాల్ట్ ప్రైవసీ సెట్టింగులను మెరుగుపరచాలని వాదించారు. అయితే, ప్రాసిక్యూటర్ల అభ్యర్థనలను కోర్టు పాక్షికంగానే అంగీకరించింది. 13 ఏళ్లలోపు పిల్లలకు వయసు నిర్ధారణను తప్పనిసరి చేయాలన్న వాదనను తోసిపుచ్చింది. అమెరికాలోని 'చిల్డ్రన్స్ ఆన్‌లైన్ ప్రైవసీ ప్రొటెక్షన్ యాక్ట్' (సీఓపీపీఏ) ప్రకారం కేవలం వయసు నిర్ధారణ కోసం పిల్లల నుంచి వ్యక్తిగత సమాచారం సేకరించడం కుదరదని కోర్టు స్పష్టం చేసింది. అంతేగాక ఇతర సోషల్ మీడియా కంపెనీలకు లేని నిబంధనలను కేవలం మెటాపై మాత్రమే విధించడం సరికాదని, అది కంపెనీపై అనవసర భారం మోపుతుందని అభిప్రాయపడింది. ఈ తీర్పుపై మెటా ఇంకా స్పందించలేదు. ఇదిలా ఉంటే.. ఇటీవల మెటాకు చెందిన ఏఐ మోడల్ సైబర్ సెక్యూరిటీ పరీక్షల్లో భాగంగా బయటి సర్వీస్‌లోకి హ్యాక్ చేయడం, టెక్నాలజీపై నియంత్రణకు సంబంధించి కొత్త ఆందోళనలను రేకెత్తించింది.

# అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం

## కీలక నిర్ణయం దిశగా ట్రంప్ ముందడుగు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 7 :** అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం నిబంధనలను కఠినతరం చేసే దిశగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక ముందడుగు వేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు నుంచి ఎదురు దెబ్బ తగిలిన కొన్ని వారాలకే, ఆ నిబంధనలను పరిమితం చేసేలా రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై గురువారం ఆయన సంతకం చేశారు. గతంలో జారీ చేసిన విస్తృత ఆదేశాలతో పోలిస్తే ఇవి పరిమిత స్థాయిలో ఉన్నప్పటికీ, వీటిపై కూడా న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. మొదటి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అమెరికాలో జన్మించిన పిల్లలకు పౌరసత్వం దక్కకుండా నిబంధనలు విధించారు. ఇద్దరు తల్లిదండ్రులు అమెరికా పౌరులు కానప్పుడు, వారిలో ఒకరిని 'శత్రు దేశస్థుడు'గా, అంటే విదేశీ ఉగ్రవాద సంస్థల్లో సభ్యుడిగా గుర్తిస్తే, వారి పిల్లలకు పౌరసత్వం వర్తించదు. దీంతోపాటు దౌత్యపరమైన మినహాయింపులు ఉన్న విదేశీ ప్రభుత్వ ఉద్యోగులు, కేవలం పౌరసత్వం కోసమే చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు (కొన్ని సరోగసీ కేసులు), ఫెడరల్ చట్టం ద్వారా పౌరసత్వం కల్పించని యూఎస్ టెరిటరీలలో జన్మించిన వారికి కూడా ఈ నిబంధన వర్తిస్తుంది. ఇక, రెండో ఆదేశం పూర్తిగా 'బర్త్ టూరిజం'ను లక్ష్యంగా చేసుకుంది. కేవలం బిడ్డకు అమెరికా పౌరసత్వం ఇప్పించడం కోసమే దేశానికి వచ్చేవారిని అడ్డుకోవాలని ఈ ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఇలాంటి వారికి వీసాలు నిరాకరించడం, అధికారిక అనుమతులు రద్దు చేయడం, దేశంలోకి ప్రవేశాన్ని నిరోధించడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలని హోంల్యాండ్ సెక్యూరిటీ, విదేశాంగ శాఖలను ఆదేశించారు. కాగా, 14వ రాజ్యాంగ సవరణ కింద అమెరికాలో పుట్టిన దాదాపు ప్రతి ఒక్కరికీ పౌరసత్వం లభిస్తుందని జూన్ 30న 'ట్రంప్ వర్సెస్ బార్బరా' కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు జన్మహక్కు పౌరసత్వాన్ని ఒక 'జోక్'గా మార్చిందని ట్రంప్ విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం 'కొన్ని సర్దుబాట్లు' చేస్తోందని వ్యాఖ్యానించారు. చారిత్రకంగా దౌత్యవేత్తలు, ఆక్రమణ దళాలకు చెందిన వారికి మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపులు ఉండేవి. ఇప్పుడు ట్రంప్ జారీ చేసిన ఈ కొత్త ఆదేశాలు సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న మినహాయింపుల పరిధిలోనే ఉన్నప్పటికీ, వాటి సరిహద్దులను పరీక్షించేలా ఉన్నాయని, ఇవి కూడా న్యాయస్థానంలో సవాలుకు గురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

# రాహుల్ ప్రయాగ్‌రాజ్ సభకు అనుమతి

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 7 :** ఆగస్టు 8న ప్రయాగ్‌రాజ్‌లో రాహుల్ గాంధీ తలపెట్టిన 'ఛాత్రోన్ కీ గూంజ్' (విద్యార్థుల గళం) సభకు యోగీ సర్కారు అనుమతిచ్చింది. పేపర్ లీకులు, నిరుద్యోగంపై విద్యార్థులతో రాహుల్ గాంధీ ఈసభలో ముఖాముఖి చర్చించనున్నారు. అయితే ముందుగా సభా వేదిక అయిన కేపీ గ్రౌండ్‌కు గతంలో ఇచ్చిన అనుమతిని రద్దు చేసి తీవ్ర ఉత్కంఠకు కారణమైన కాయస్థ పాఠశాల (కేపీ) ట్రస్ట్.. గురువారం అర్ధరాత్రి వెనక్కి తగ్గింది. కొన్ని షరతులతో సభ నిర్వహణకు మళ్లీ అనుమతి ఇస్తున్నట్లు ప్రకటించింది. సదస్సుకు పర్మిషన్ రావడంతో కాంగ్రెస్ శ్రేణులు సభా ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8:30 గంటల వరకు కేపీ గ్రౌండ్‌లో వేలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువతతో నేరుగా సంభాషిస్తారు రాహుల్ గాంధీ.

# హిందూజా సోదరులకు ఊరట

- బోఫోర్స్ కేసును కొట్టేసిన సుప్రీం
- 40 ఏళ్ల బోఫోర్స్ కేసుకు పడిన తెర

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 7 :** దాదాపు నాలుగు దశాబ్దాలుగా దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా నిలిచిన బోఫోర్స్ కుంభకోణం కేసుకు తెరపడింది. దీని నుంచి హిందూజా సోదరులకు ఊరట కల్పిస్తూ ఢిల్లీ హైకోర్టు 2005లో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన చివరి పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ఈ కేసుకు సంబంధించిన న్యాయపరమైన ప్రక్రియ పూర్తిగా ముగిసింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ వినోద్ కె. చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. విచారణ వాయిదా వేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరినా, కోర్టు అంగీకరించలేదు. ఇప్పటికే చాలా కాలం గడిచిందని పేర్కొంటూ పిటిషన్‌ను తిరస్కరించింది. విచారణ సందర్భంగా "హిందూజా సోదరులు, సీబీఐ వ్యవహారం ఇంకా ఎందుకు కొనసాగుతోంది? అన్ని కేసులను హైకోర్టు కొట్టేసింది కదా. ఇంకా ఎంతకాలం ఈ వ్యవహారం కొనసాగుతుంది?" అని జస్టిస్ పార్దీవాలా వ్యాఖ్యానించారు. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది 1986లో ఈ ఒప్పందం జరిగిందని వివరించే ప్రయత్నం చేసినా, ధర్మాసనం మరిన్ని వాదనలు వినేందుకు నిరాకరించింది. 2005 మే 31న ఢిల్లీ హైకోర్టు హిందూజా సోదరులు శ్రీచంద్, గోపీచంద్, ప్రకాశ్ హిందూజాలతో పాటు స్వీడన్‌కు చెందిన ఏబీ బోఫోర్స్ కంపెనీపై ఉన్న క్రిమినల్ కేసులను కొట్టివేసింది. అప్పట్లో దర్యాప్తు తీరుపై కూడా సీబీఐని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఆ తీర్పును సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన అప్పీల్‌ను కూడా సుప్రీంకోర్టు 2018లో తిరస్కరించింది. అప్పీల్ దాఖలులో 4,522 రోజుల ఆలస్యం జరిగిందని పేర్కొంటూ దానిని స్వీకరించలేదు. 1986లో భారత ప్రభుత్వం స్వీడన్‌కు చెందిన ఏబీ బోఫోర్స్ సంస్థతో రూ.1,437 కోట్ల విలువైన 400 హోవిట్జర్ గన్‌ల కొనుగోలు ఒప్పందం చేసుకుంది. 1987లో ఈ ఒప్పందంలో అక్రమ కమీషన్లు చెల్లించారనే ఆరోపణలు వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం చెలరేగింది. అనంతరం సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. తాజాగా సుప్రీంకోర్టు చివరి పిటిషన్‌ను కూడా కొట్టివేయడంతో బోఫోర్స్ కేసు చట్టపరంగా ముగిసినట్లైంది.

# యువ పారిశ్రామికవేత్తల వినూత్న ఆవిష్కరణ

- మైసీలియం, వ్యవసాయ వ్యర్థాలతో 'ఫంగీ లెదర్'
- పర్యావరణహిత ప్రత్యామ్నాయ తోలు తయారీ
- రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు.. ప్రత్యేక ప్రదర్శన

**న్యూఢిల్లీ,ఆగస్ట్7 :** బూట్లు, బ్యాగులు, బెల్టులు, జాకెట్లు, వాహనాల సీట్లు ఇలా మనం రోజూ ఉపయోగించే ఎన్నో వస్తువుల తయారీలో జంతువుల తోలును విస్తృతంగా వినియోగిస్తుంటారు. అయితే దీనికోసం లక్షలాది జంతువులు బలవుతుండగా, పర్యావరణ కాలుష్యం కూడా పెరుగుతోంది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే ప్రయత్నంలో ఒడిశాకు చెందిన ఓ స్టార్టప్ వినూత్న ఆవిష్కరణ చేసింది. శిలీంధ్రాల (ఫంగస్)లోని భాగమైన మైసీలియం, వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి జంతు తోలుకు ప్రత్యామ్నాయంగా 'ఫంగీ లెదర్'ను అభివృద్ధి చేసింది. ఈ పర్యావరణహిత ఉత్పత్తి ఇప్పుడు రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలో ప్రశంసలు అందుకుంది. ఒడిశాకు చెందిన అర్బన్–హైఫ్ బయోసైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే స్టార్టప్‌ను యువ పారిశ్రామికవేత్తలు నిషరాజ్ మహాపాత్ర, వివేక్ సింగ్ అనే ఇద్దరు స్నేహితులు స్థాపించారు. పర్యావరణాన్ని కాపాడుతూ ఫ్యాషన్ రంగంలో మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో వీరు ఈ సాంకేతికతను అభివృద్ధి చేశారు. శిలీంధ్రాల్లోని ప్రధాన భాగమైన మైసీలియంను ప్రత్యేక పద్ధతిలో పెంచి, దానిని సాగే గుణం కలిగిన తోలుగా మార్చే ప్రక్రియను రూపొందించారు. దీనివల్ల జంతు తోలు, సింథటిక్ లెదర్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగించగల నాణ్యమైన బయో మెటీరియల్‌ను తయారు చేస్తున్నారు. ఈ వినూత్న ఉత్పత్తికి ఇప్పటికే విశేష గుర్తింపు లభించింది. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రదర్శనలో ఈ స్టార్టప్ తమ ఉత్పత్తులను ప్రదర్శించగా ప్రశంసలు అందుకుంది. పర్యావరణ పరిరక్షణ, ఆధునిక బయోటెక్నాలజీ కలయికతో రూపొందిన ఈ ఫంగీ లెదర్ భవిష్యత్తులో ఫ్యాషన్ పరిశ్రమకు కొత్త దిశ చూపుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ స్టార్టప్ తయారు చేస్తున్న ఫంగీ లెదర్‌తో బ్యాగులు, బూట్లు, పర్సులు, బెల్టులు, వాచ్ పట్టీలు, దుస్తులు వంటి ఉత్పత్తులను రూపొందిస్తున్నారు. భవిష్యత్తులో ఫర్నిచర్, ఇంటీరియర్ డిజైన్, ఆటోమొబైల్ పరిశ్రమ, లైఫ్‌స్టైల్ ఉత్పత్తుల తయారీలో కూడా దీనిని వినియోగించే అవకాశాలు ఉన్నాయని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. అంతేకాదు, ఈ బయో మెటీరియల్‌ను ప్యాకేజింగ్, నిర్మాణ రంగం, ఇన్సులేషన్ మెటీరియల్స్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లకు ప్రత్యామ్నాయంగా కూడా ఉపయోగించవచ్చని వారు పేర్కొంటున్నారు. ఫంగీ లెదర్ తయారీ తర్వాత మిగిలిపోయే సేంద్రియ పదార్థాలను కూడా పూర్తిగా రీసైకిల్ చేయడం వల్ల వ్యర్థాలు దాదాపు ఉండవు. ఈ వినూత్న ఉత్పత్తి తయారీకి వరి పొట్టు, చెక్క ముక్కలు వంటి వ్యవసాయ వ్యర్థాలను వినియోగిస్తారు. ముందుగా వాటిని క్రిమిరహితం చేసి, ప్రయోగశాలలో తయారుచేసిన ప్రత్యేక పోషక మాధ్యమంతో కలుపుతారు. అనంతరం నియంత్రిత ఉష్ణోగ్రత, తేమ ఉన్న గదిలో పెద్ద ట్రేలలో ఉంచుతారు. కొన్ని రోజుల తర్వాత మైసీలియం క్రమంగా పెరిగి మొత్తం ఉపరితలాన్ని ఆక్రమిస్తుంది.

# నిజాయితీ ఉంటే అమిత్ షాతో రాజీనామా చేయించండి

## మోహన్ భాగవత్‌కు కేసీ వేణుగోపాల్ సవాల్

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 7 :** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ ఇటీవల జెన్–జీపై చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ శుక్రవారం తీవ్రంగా స్పందించారు. యువత పట్ల ఆయనకు నిజంగా నిజాయితీ ఉంటే, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేత రాజీనామా చేయించాలని సవాల్ విసిరారు. అంతేకాదు ప్రస్తుతం ప్రభుత్వాన్ని ఆర్‌ఎస్‌ఎస్ నడిపిస్తోందని, కనుక నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై ఇటీవల జరిగిన పోలీసు చర్యకు ఆ సంస్థే బాధ్యత వహించాలని అన్నారు. ప్రభుత్వాన్ని ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రిస్తోంది. వారికి జెన్? జీ యువతపై నిజంగానే శ్రద్ధ ఉంటే, కేంద్ర హోంమంత్రిని రాజీనామా చేయమని మోహన్ భాగవత్ అడగాలి. లేదంటే కనీసం పార్లమెంట్‌కు వచ్చి విద్యార్థులకు, అలాగే ప్రధానమంత్రికి క్షమాపణలు చెప్పాలి. విద్యార్థుల పట్ల ఆయనకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, పెల్లెట్ గన్స్, లాఠీఛార్జ్ రూపంలో విద్యార్థులపై జరిగిన అణచివేతను ఆయన ఖండించాలి. కానీ దీనిపై ఆయన ఎందుకు మౌనంగా ఉన్నారు. ఇవన్నీ కేవలం కంటితుడుపు చర్యలు మాత్రమేనని అన్నారు.

# స్కూల్‌లో విద్యార్థి కాల్పులు

## ఏడుగురి మృతి

**థాయ్‌లాండ్ :** థాయ్‌లాండ్‌లోని ఓ స్కూల్‌లో కాల్పులు కలకలం సృష్టించాయి. నొంతగురి ప్రావిన్స్ బాంగ్ క్రువాయ్ జిల్లాలోని డెబ్సిరిన్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థి.. తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా.. 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు టీచర్లు, ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. కాల్పులు జరిపిన విద్యార్థి కూడా తనను తాను కాల్చుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై థాయ్ ఉప ప్రధాని అనుతిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని.. స్కూల్‌పై దాడికి గల కారణాలు తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# నేడు పింఛనుదారుల మహాధర్నా

**హైదరాబాద్, ఆగస్ట్ 7 :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం నేడు ఆగస్టు 7న మహాధర్నాకు పిలుపునిచ్చారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, పీఆర్సీ అమలు, హెల్త్ స్కీమ్ మెరుగుదల వంటి ప్రధాన డిమాండ్లతో ఈ ఆందోళన చేపడుతున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తమను ప్రభుత్వం విస్మరించడం సరికాదనీ, తక్షణమే జోక్యం చేసుకుని డిమాండ్లను నెరవేర్చాలని వారు కోరుతున్నారు. రాజధాని హైదరాబాద్‌తో పాటుగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల దగ్గర ఈ నిరసన కార్యక్రమాలు జరగనున్నాయి. న్యాయమైన తమ హక్కుల కోసం చేస్తున్న ఈ పోరాటంలో ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే, రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పింఛనుదారుల సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు.



## విజయ హోమ్స్‌కు ఐసీయు మంచాలు, విల్ చైర్లను అందజేసిన హ్యుందాయ్ సంస్థ

**నాగారం,ఆగస్టు 7(జనం వార్త):** సత్యసాధన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడు తున్న విజయ హోమ్స్ ఫర్ ఎల్డర్స్ కు హ్యుందాయ్ ఇండియా ఇన్సూరెన్స్ బ్రోకింగ్ సంస్థ ప్రతినిధులు ఆధునిక ఐసీయు పడకలు,విల్ చైర్లను విరాళంగా అందజేశారు. శుక్రవారం గోధుమకుంట గ్రామంలో ని విజయ హోమ్స్ ఫర్ ఎల్డర్ లో వృద్ధులకు హ్యుందాయ్ ఇండియా ఇన్సూరెన్స్ బ్రోకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ జోనల్ రీజినల్ మేనేజర్ అమిత్ వాస్తవ,హైదరాబాద్ రీజినల్ మేనేజర్ లు అరవింద్ చారి,జె. శివలు వృద్ధులకు అత్యాధునిక ఐసీయు పడకలు,విల్ చైర్లను వృద్ధులకు అందజేశా రు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ అత్యాధునిక ఐసీయు పడకలు దీర్ఘకాలిక వైద్య సంరక్షణ అవసరమయ్యే వృద్ధులకు మరింత సౌకర్యవంతమైన, సురక్షిత సేవలను అందించడం లో సహాయపడుతాయన్నారు. విల్ చైర్లు స్వతంత్ర గా జీవించేందుకు తోడ్పడతాయన్నారు. వృద్ధుల సంక్షేమం కోసం హ్యుందాయ్ ఇండియా ఇన్సూరెన్స్ బ్రోకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అందించిన సహకారం గొప్పదని విజయ హోమ్స్ ఫర్ ఎల్డర్ యాజమాన్యం అన్నారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన సీ ఈ ఓ సమీర్ సంధాని,చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ పంకజ్ కాఠోర్ లకు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో విజయ హోమ్స్ ఫర్ ఎల్డర్స్ కార్యదర్శి డాక్టర్ కె. విజయ లక్ష్మి,డాక్టర్ కె. ఎల్.నరసింహ రావు, డాక్టర్ చంద్రశేఖర్,డాక్టర్ రామకృష్ణ,జయంతి పాల్గొన్నారు.



## పండుగ సాయన్న విగ్రహం తొలగింపుపై ఆవేదన వ్యక్తం

**నాగర్‌కర్నూల్, ఆగస్టు 7 (జనం వార్త):** నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలో ఏర్పాటు చేసిన ప్రజల వీరుడు పండుగ సాయన్న విగ్రహాన్ని తొలగించడాన్ని తెనుగోళ్ల జాతి ఆత్మగౌరవానికి జరిగిన అవమానంగా భావిస్తున్నట్లు పలువురు పేర్కొన్నారు. పండుగ సాయన్న ప్రజల కోసం పోరాడిన మహనీయుడని, ఆయనను గౌరవించడం అంటే బహుజన సమాజాన్ని గౌరవించినట్లేనని అభిప్రాయపడ్డారు. విగ్రహాన్ని తొలగించడం బహుజన జాతుల మనోభావాలను దెబ్బతీసే చర్యగా పేర్కొన్నారు. పండుగ సాయన్న విగ్రహాన్ని యథాతథ స్థానంలో తిరిగి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెనుగోళ్ల సమాజం ఐక్యంగా ఉండి శాంతియుత మార్గంలో తమ నిరసనను తెలియజేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుత పోరాటాల ద్వారానే న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.



## ప్రైవేట్ పాఠశాల పక్కనే వెలిసిన మురుగునీటి కుంట..

### విద్యార్థుల ఆరోగ్యంపై ఆందోళన

**శేరిలింగంపల్లి, ఆగస్టు 7(జనం వార్త):** శేరిలింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని శ్రీరాంప్రసాద్ దూబే కాలనీలో ఉన్న సాహితి విద్యానికేతన్ హైస్కూల్ పక్కనే రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండటంతో స్థానికులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఈ మురుగునీటి మధ్యే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానికుల కథనం ప్రకారం, ఇదే కాలనీలో నాలుగు నెలల క్రితం బీఆర్ఎస్ నాయకులు నిర్వహించిన బస్తీబాట కార్యక్రమంలో ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని ఆరోపిస్తున్నారు. డివిజన్‌లోని ఇతర బస్తీల్లో సీసీ రోడ్లు నిర్మించినప్పటికీ, ఈ కాలనీ మాత్రం నిర్లక్ష్యానికి గురైందని వారు పేర్కొంటున్నారు. పరిసరాల్లో చెత్త కనిపిస్తే చలాన్లు విధించే అధికారులు, ఇక్కడ పేరుకుపోయిన మురుగునీరు, చెత్తను గుర్తించకపోవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణం కొనసాగితే విద్యార్థులు అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిల్వ ఉన్న మురుగునీటిని తొలగించి, సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీ వాసులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## జిల్లా నూతన బిజెపి అధ్యక్షుడిని సన్మానించిన నర్వ పవన్

**కూకట్‌పల్లి, ఆగస్టు 7 (జనం వార్త) :** బిజెపి జిల్లా నూతన అధ్యక్షులుగా నియమితులైన గిరివర్ధన్ రెడ్డిని జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ నర్వ పవన్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిని నర్వ పవన్ కుమార్ శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన అధ్యక్షులు అధ్యక్షులు గిరి వర్ధన్ రెడ్డి నేతృత్వంలో బిజెపి జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ విధానాలను, ప్రజా సమస్యలపై పోరాటాలను డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి బిజెపి ఐటీ సెల్ పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో మాధవరం కాంతారావు, బాచుపల్లి మాజీ కార్పొరేటర్ సుబ్బారావు, కూకట్‌పల్లి ఓబీసీ కన్వీనర్ వినోద్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జిల్లా అధ్యక్షుడికి అభినందనలు తెలియజేశారు.

# మండల్ స్ఫూర్తి రాజకీయ అధికారంగా మారినప్పుడే ప్రజాస్వామ్యం సంపూర్ణం

డా. జె. పూర్ణచంద్రరావు



**శేరిలింగంపల్లి, ఆగస్టు 7(జనం వార్త):** దేశంలో ఓటు హక్కు అందరికీ ఉన్నప్పటికీ, రాజకీయ ప్రాతినిధ్యం అందరికీ లభించకపోవడంతో భారతదేశంలో ఇప్పటికీ "సగం ప్రజాస్వామ్యమే" అమలులో ఉందని మాజీ డీజీపీ, సామాజిక న్యాయవాది డా. జె. పూర్ణచంద్రరావు అన్నారు. శుక్రవారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఓబీసీఎస్ఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన మండల్ దినోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించినప్పటికీ, శాసనసభలు, పార్లమెంట్‌లలో జనాభా నిష్పత్తికి అనుగుణంగా అన్ని వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం లభించడం లేదని అన్నారు. ఓటు ప్రజాస్వామ్యం వచ్చినా, అధికార ప్రజాస్వామ్యం ఇంకా పూర్తిస్థాయిలో అమలు కాలేదని పేర్కొన్నారు. మండల్ కమిషన్ అధ్యక్షుడు బి.పి. మండల్‌ను సామాజిక న్యాయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే మహానేతగా అభివర్ణించిన ఆయన, వెనుకబడిన వర్గాల సామాజిక, విద్యా వెనుకబాటుతనాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసి 52 శాతం జనాభాకు 27 శాతం రిజర్వేషన్లు సిఫారసు చేయడం ద్వారా భారత రాజకీయాల్లో చారిత్రక మార్పుకు నాంది పలికారని తెలిపారు. 1990లో అప్పటి ప్రధానమంత్రి వి.పి.సింగ్ మండల్ సిఫారసులను అమలు చేయడంతో దేశంలో సామాజిక న్యాయ ఉద్యమం కొత్త దశలోకి ప్రవేశించిందన్నారు. కాన్షీరాం, శరద్ యాదవ్ వంటి నాయకులు దేశవ్యాప్తంగా సామాజిక న్యాయ రాజకీయాలకు బలం చేకూర్చారని, ఉత్తర భారతదేశంలో ఓబీసీ రాజకీయ శక్తి ఎదుగుదలకు మండల్ ఉద్యమం కీలక మలుపుగా నిలిచిందన్నారు. అనంతరం ఎల్.కే. అద్వానీ చేపట్టిన రథయాత్రతో "మండల్ వర్సెస్ కమండల్" రాజకీయాలు ప్రారంభమై, సామాజిక న్యాయం నుంచి మత ధ్రువీకరణ వైపు రాజకీయ అజెండా మళ్లిందని వ్యాఖ్యానించారు. మండల్ అమలును ప్రకటించిన సమయంలో అప్పటి ప్రతిపక్ష నాయకుడు రాజీవ్ గాంధీ పార్లమెంట్‌లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారని, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ప్రభుత్వాల కాలంలో మండల్ నివేదిక అమలు కాలేదని గుర్తుచేశారు. అయితే తరువాత కాంగ్రెస్ ప్రభుత్వాలే కేంద్ర విద్యాసంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్లను అమలు చేసిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. తెలంగాణలో బీసీలు సుమారు 56 శాతం జనాభా ఉన్నప్పటికీ శాసనసభలో వారి ప్రాతినిధ్యం కేవలం 19 మంది ఎమ్మెల్యేలకే పరిమితమైందని, ఆంధ్రప్రదేశ్‌లో 52 శాతం జనాభా ఉన్నప్పటికీ కేవలం 40 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. జనాభా ప్రాతినిధ్యం మధ్య ఉన్న ఈ వ్యత్యాసాన్ని ఆయన "హాఫ్ డెమోక్రసీ"గా అభివర్ణించారు. ఉద్యోగాలు, విద్యలో రిజర్వేషన్లతో పాటు శాసనసభల్లోనూ తగిన రాజకీయ ప్రాతినిధ్యం అవసరమని పేర్కొన్న ఆయన, విద్యార్థులు ఉద్యోగాలకే పరిమితం కాకుండా రాజకీయ నాయకత్వాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. "క్యాంపస్ నుంచి క్యాబినెట్ వరకు, హాస్టల్ నుంచి అసెంబ్లీ వరకు ప్రయాణించాలి. ఉద్యమకారులుగానే కాకుండా చట్టాలు చేసే ప్రజాప్రతినిధులుగా ఎదగాలి" అని సూచించారు. ఏఐఓబీసీఎస్ఏ ఇకపై కేవలం ఉద్యమ సంస్థగానే కాకుండా రాజకీయ చైతన్యానికి కేంద్రంగా మారాలని, విద్యార్థి ఉద్యమం రాజకీయ నాయకత్వాన్ని తయారు చేయాలని అన్నారు. మండల్ ఉద్యోగ అవకాశాల తలుపులు తెరిచిందని, ఇక రాజకీయ అధికార ద్వారాలు తెరవడం ఈ తరం విద్యార్థుల బాధ్యత అని పేర్కొన్నారు. సంపూర్ణ ప్రజాస్వామ్యం కోసం ఏఐఓబీసీఎస్ఏ విద్యార్థులు రాజకీయ రంగంలోకి వచ్చి విధానాలను ప్రభావితం చేసే నాయకులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూరజ్ మండల్, తెలంగాణ విఠల్, ఎమ్మెల్సీ వై. అనిల్ కుమార్, సంగెం సూర్యారావుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ సంతబజార్‌లో రోడ్డే దినసరి కూలీల అడ్డా

### కూలీలకు సౌకర్యాలు కరువు ట్రాఫిక్, వ్యాపారానికి ఇబ్బందులు



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 7 (జనం వార్త):** నాగర్‌కర్నూల్ సంతబజార్ ప్రధాన రహదారిపై ప్రతిరోజూ వందలాది మంది దినసరి కూలీలు పని కోసం నిరీక్షిస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ప్రత్యేక లేబర్ అడ్డా లేకపోవడంతో కూలీలు రోడ్డుపైనే ఉండాల్సి వస్తోంది. సంతబజార్‌లోని కాఫీ షాపులు, మెడికల్ షాపులు, బంగారు దుకాణాల ముందు కూలీలు గుమికూడడంతో కస్టమర్లు దుకాణాలకు చేరుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి శుక్రవారం సంత రోజు రద్దీ మరింత పెరగడంతో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కూలీల కోసం ప్రత్యేక లేబర్ అడ్డా ఏర్పాటు చేసి, అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

## మంత్రులను కలిసిన నాగారం కాంగ్రెస్ నాయకులు

### .బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేత



**నాగారం,ఆగస్టు 7(జనం వార్త) :** తెలంగాణ రాష్ట్ర మంత్రి రామోదర్ రాజనరసింహ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్,సీఎం సోదరుడు అనిల్ రెడ్డి లను నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.నాగారం డివిజన్ లో ఈ ఆదివారం 9న జరగబోయే శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల పండుగ ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఫలహారం బండి ఊరేగింపుకు ఉత్సవాలకు హాజరుకావాలని పార్టీ సీనియర్ నాయకులు కందాడి అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కందాడి అంజి రెడ్డి,డివిజన్ మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు, నాయకులు చిన్నంరాజు సత్తీష్ గౌడ్, దాసోహం (చిన్న) గణపురం కొండల్ రెడ్డి, తాలీం,తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఎస్సీ కమ్యూనిటీ హాల్



**నాగర్‌కర్నూల్,వట్టెం ఆగస్టు 7 (జనం వార్త):** స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలిపోతుందోనన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. భవనం చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. నిల్వ నీరు, చెత్త కారణంగా దోమలు విపరీతంగా పెరిగి డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా, ఈ శిథిల భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. భవనం ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉన్నందున సంబంధిత అధికారులు వెంటనే స్పందించి భవనాన్ని తొలగించడం లేదా మరమ్మతులు చేపట్టడంతో పాటు పరిసరాలను శుభ్రం చేసి ప్రజల ప్రాణాలకు ముప్పు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్నీ స్థానిక గౌరవ ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకుపోయి కొత్త భవనం మంజూరు చేయవలసిందిగా గ్రామస్తులు కోరుతున్నారు

## మాజీ కార్యదర్శి కి వీడ్కోలు పలుకుతూ నూతన కార్యదర్శి కి స్వాగతం పలికిన సర్పంచ్ కృష్ణవేణి హరినాయక్



**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఆగస్టు 07(జనం వార్త ) :** ఫరూక్ నగర్ మండలం, గిరాయి గుట్ట తండా గ్రామ పంచాయతీలో ఈ రోజు సర్పంచ్ కృష్ణవేణి హరినాయక్ గారి ఆధ్వర్యంలో గిరాయ గుట్ట తండా కి దాదాపు 7 సంవత్సరాల పాటు సేవలందించిన కార్యాదర్షి శ్రీమతి స్వాతి గారు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు గిరాయ గుట్ట తండా గ్రామ పంచాయతీ నుండి నందిగామ మండలం మోత్కుల గూడా గ్రామానికి బదిలీ కావడం జరిగినది కావున గ్రామ పంచాయతీ ప్రజలందరూ శ్రీ మతి స్వాతీ గారినీ వీడ్కోలు పలుకుతూ నూతన కార్యదర్శి బదిలీ పై వచ్చిన వంశీ కృష్ణా గారికి సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్ ఎంతో ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్, ఉప సర్పంచ్ రాజు, వార్డు సభ్యులు రాణి పాండు, రాజు, మౌనిక రమేష్, పవన్ కుమార్, సరిత నరేష్ బాబు, సువర్ణ మురళి, సరిత కిషన్, పూజారి పెంటూ, పాఠశాల అధ్యాపకురాలు అనూష,గ్రామ పంచాయతీ సిబ్బంది గోపాల్, తారమ్మ, రూకాలి , ముత్యాలీ ,సీనియర్ నాయకులు మంగులాల్, యువకులు సాయి, శ్రీను, ప్రవీణ్, అశోక్ మరియు తదితరులు పాల్గొన్నారు



## సాయి విద్యానికేతన్ పాఠశాలలో బోనాల పండుగ

**దుబ్బాక ప్రతినిధి ఆగస్టు 7(జనం వార్త) :** దుబ్బాక మండల పరిధిలోని గంభీర్ పూర్ శ్రీ సాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బోనాల పండుగ వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి, భక్తిశ్రద్ధలతో బోనాలను శిరస్సుపై ఎత్తుకుని ప్రదర్శనగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు పోతరాజుల వేషధారణతో విన్యాసాలు చేస్తూ సందడి చేశారు. తమ నృత్యాలు, అభినయంతో అటు పాఠశాల ఆవరణలో అలజడి సృష్టిస్తూనే, వచ్చిన వారందరినీ విశేషంగా అలరించి ఆనందింపజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షరీఫ్ మాట్లాడుతూ, మన సంస్కృతి, సాంప్రదాయాలను నేటి తరానికి అందించడంలో పాఠశాలల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో భక్తిభావాన్ని, సాంస్కృతిక స్పృహను పెంపొందించడానికే ఇలాంటి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందరి భాగస్వామ్యంతో ఈ బోనాల ఉత్సవం అత్యంత కోలాహలంగా సాగి, విజయవంతమైంది.



## అభివృద్ధి హామీలు ఎక్కడ?

### సర్పంచ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు గ్రామాలలో ఎక్కడ?

**దుబ్బాక ప్రతినిధి ఆగస్టు 7 (జనం వార్త) :** సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం లో సర్పంచ్ ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఎక్కడ అమలు కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పీఠం కోసం లక్ష లక్షల ఖర్చుపెట్టిన అభ్యర్థులు ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పుడు గ్రామాల్లో అభివృద్ధి జాడలు కనిపించడం లేదు గ్రామాల అభివృద్ధిపై ప్రజా వాయిస్ ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామాల అభివృద్ధి ఎందుకు వెనుకబడ్డట్లు గ్రామాలలో ఇప్పటివరకు ఇంకా మురికి కాలువలో మంచి నీటి సౌకర్యాలు లేక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇంకా కొన్ని గ్రామాలలో కేవలం మహిళ సర్పంచ్ అయితే వారి భర్తల పెత్తనం కొనసాగుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలపై మాట్లాడదామంటే సర్పంచిల భర్తలు ముందు వస్తున్నారని ఇంకొక కొన్ని గ్రామాలలో మహిళా సర్పంచుల భర్తలు గ్రామపంచాయతీ వేదికగా చేసుకొని పంచాయతీలు చెప్తున్నారు. ఇప్పటికైనా ఎన్నికల్లో ఖర్చుపెట్టిన దృష్టి గ్రామాల అభివృద్ధి పైన పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



## గ్రామ అభివృద్ధిపై అధ్యయనం నిర్వహించిన జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ బృందం

**బిజినపల్లి, వట్టెం, ఆగస్టు 7 (జనం వార్త):** హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నుంచి వచ్చిన అధ్యయన బృందం గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం వట్టెం గ్రామంలో గ్రామీణ అభివృద్ధిపై అధ్యయనం నిర్వహించింది. ఈ సందర్భంగా గ్రామంలోని సహజ వనరులు, భూవినియోగం, నీటి వనరులు, గ్రామ చరిత్ర, సామాజిక, ఆర్థిక పరిస్థితులు, గ్రామ అభివృద్ధి అవసరాలపై గ్రామస్థులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. గ్రామ ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలపై వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిట్టల జ్యోతి , ఏఈఓ భార్గవ్, రామ్‌మోహన్, ఆంజనేయులు, బాలస్వామి, శ్రీనాథ్ రెడ్డి, కృష్ణ, నరేందర్, శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రీన్ అంబాసిడర్లు, విద్యార్థులు దివ్య, తేజస్విని, శ్రీలత, గౌతమి, ఐశ్వర్య, వరలక్ష్మి, గ్రామ పెద్దలు, మహిళలు, రైతులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## దుబ్బాక 100 పడకల ఆసుపత్రిలో మరో అరుదైన ఆపరేషన్



**దుబ్బాక ప్రతినిధి ఆగస్టు7(జనం వార్త) :** సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం లోని 100 పడకల ఆసుపత్రిలో డాక్టర్ హేమ రాజు సింగ్ ఆధ్వర్యంలో అరుదైన ఆపరేషన్ నిర్వహించారు.సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి లో ఈ రోజు ఏమర్జెన్సీ ఆపరేషన్ చేయడం జరిగింది ఎంగరి రక్షిత కడుపు నొప్పి తో ఆస్పత్రికి రావడం జరిగింది అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించడం జరిగింది స్కానింగ్ లో రైట్ ట్యూబ్ లో రప్చర్డ్ ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ అని తేలింది అబ్డోమెన్ ఓపెన్ చేయాగానే దాదాపు 2లీటర్ల రక్తం బ్లీడింగ్ అయ్యింది. వారికీ రెండు యూనిట్ల రక్తం ఎక్కించి డాక్టర్ హేమరాజ్ సింగ్ సార్ ఆధ్వర్యంలో ఆపరేషన్ చేయడం జరి గింది ప్రస్తుతం పేషెంట్ ఆరోగ్య పరిస్థితి బాగుంది ఈ ఆపరేషన్ లో మత్తు డాక్టర్స్ అస్మా , పూజ థియేటర్ సిబ్బంది ఆరోగ్య శ్రీ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఐ ప్రజా పాదయాత్ర

**బిజినపల్లి, ఆగస్టు 7 (జనం వార్త):** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ సమితి పిలుపు మేరకు కొనసాగుతున్న ప్రజా పాదయాత్ర రెండో రోజు బిజినపల్లి మండలం వెలుగొండ నుండి బయలుదేరి వట్టెం గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభకు భూపేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరిస్తున్నాయని విమర్శించారు. తాగునీరు, సాగునీరు, ఉపాధి, రైతులకు గిట్టుబాటు ధర, పేదలకు ఇళ్ల స్థలాలు, విద్య, వైద్యం వంటి సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ప్రజలతో కలిసి పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, పెరుగుతున్న విద్యా ఖర్చులు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొంటూ, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసి నాణ్యమైన ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఉద్యమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పాదయాత్రకు గ్రామ ప్రజలు విశేష స్పందన తెలియజేస్తూ తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం కొనసాగుతుందని సిపిఐ నాయకులు స్పష్టం చేశారు.



## పండుగ సాయన్న విగ్రహం తొలగింపుపై డీఎఫ్‌సీఎస్ చైర్మన్ వాకిటి ఆంజనేయులు ఆగ్రహం

**విగ్రహాన్ని యథాస్థానంలోనే పునఃప్రతిష్ఠ చేయాలని డిమాండ్**

**నాగర్‌కర్నూల్, ఆగస్టు 7 (జనం వార్త):** నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహాన్ని ఆర్టీసీ అధికారులు తొలగించడాన్ని డీఎఫ్‌సీఎస్ జిల్లా చైర్మన్ వాకిటి ఆంజనేయులు తీవ్రంగా ఖండించారు. స్థానిక తెలుగు ముదిరాజుల సమాచారంతో అక్కడికి చేరుకుని నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యామ్నాయ స్థలం చూపిస్తామని చెప్పినప్పటికీ, స్థల సేకరణ పూర్తికాకముందే ఆర్టీసీ సిబ్బంది క్రేన్, జేసీబీ సహాయంతో విగ్రహాన్ని తొలగించి నిర్మానుష్య ప్రాంతంలో పడేయడం బాధాకరమని అన్నారు. నిరసనల అనంతరం ప్రభుత్వ అధికారులు చర్చలు జరిపి, విగ్రహాన్ని తొలగించడం తప్పేనని అంగీకరించారని, సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి విగ్రహాన్ని యథాస్థానంలోనే పునఃప్రతిష్ఠ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. విగ్రహాన్ని తమకు ఆమోదయోగ్యమైన స్థలంలోనే ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు, ధర్నాలు, ఆర్టీసీ డిపోల ఎదుట ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పండుగ సాయన్న విగ్రహం పునఃప్రతిష్ఠ జరిగే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని వాకిటి ఆంజనేయులు స్పష్టం చేశారు.



## సర్పంచ్‌పై పోలీసుల దాడి ..

**పరామర్శించిన బీసీ-ఎస్సీ-ఎస్టీ జేఏసీ చైర్మన్ డా. విశారదన్ మహారాజ్**

**రంగారెడ్డి జిల్లా,ఇబ్రహీంపట్నం,ఆగస్టు 7(జనం వార్త):** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని దండుమైలారం గ్రామ కంఠం భూముల సమస్యపై మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)కి వినతిపత్రం అందజేయడానికి గ్రామ సర్పంచ్ నరేష్ గౌడ్, బీసీ-ఎస్సీ-ఎస్టీ జేఏసీ నాయకులు తులసి, రవీందర్ తదితరులు వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ పోలీసులు జోక్యం చేసుకుని గ్రామ సర్పంచ్ నరేష్ గౌడ్‌పై దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనలో గాయపడిన సర్పంచ్‌ను బీసీ-ఎస్సీ-ఎస్టీ జేఏసీ చైర్మన్ డా. విశారదన్ మహారాజ్ పరామర్శించి, సంఘటన వివరాలను తెలుసుకున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారుల చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.



## 36వ మండల్ డేను ఘనంగా నిర్వహించిన బీసీ సంఘం నాయకులు

**బిజినపల్లి,మంగనూర్,ఆగస్టు 7(జనం వార్త):** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం మంగనూర్ గ్రామంలో 36వ మండల్ డే సందర్భంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 1990 ఆగస్టు 7న మండల్ కమిషన్ సిఫారసుల మేరకు దేశంలోని బీసీ వర్గాలకు విద్య, ఉద్యోగ రంగాల్లో కేంద్ర ప్రభుత్వ 27 శాతం రిజర్వేషన్లకు ఆమోదం లభించిన చారిత్రక దినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండల్ కమిషన్ ప్రాధాన్యత, బీసీలకు రిజర్వేషన్ల వల్ల కలిగిన ప్రయోజనాలపై అప్పల మాసయ్య యాదవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అప్పల మాసయ్య యాదవ్, వేముల సత్యశీల సాగర్, మేకల యాదయ్య యాదవ్, వంక వెంకటయ్య, ఎలుక నరసింహ, బోయ బాలయ్య, జాజిమొగ్గ యాదయ్య, కుర్వ శ్రీశైలం, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

# చట్టం చేస్తున్నాం.. బీసీలకు సంరక్షణ కల్పిస్తాం

- చేనేతలకు మేలు చేసేది.. అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే
- మాది బ్రాండ్ ఇమేజ్.. వాళ్లది బ్యాడ్ ఇమేజ్
- జన్-జీ అభివృద్ధి కోరుకుంటోంది.. జనరేషన్ గొడ్డలి కుట్రలు పన్నుతోంది
- 12వ జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు
- చీరాలలో నేతన్న సేవలో పథకం ప్రారంభం



**చీరాల, ఆగస్టు 7:** బీసీల సంరక్షణను చేపట్టే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని... దీనికోసం త్వరలోనే చట్టం చేస్తున్నామని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బీసీ సంరక్షణ చట్టం కోసం ముసాయిదా సిద్ధమైందని వెల్లడించారు. శుక్రవారం 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలోని కొత్తపేట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నేతన్న సేవలో సంక్షేమ పథకాన్ని సీఎం ప్రారంభించారు. రాష్ట్రంలోని అర్హులైన చేనేత కుటుంబాలకు రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని సీఎం అందించారు. మొ- త్తంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ.179 కోట్లను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అలాగే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నా... రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం-అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని అడ్డుకునేలా జరుగుతున్న కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని సూచించారు. ఇలాంటి వారి విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉంటుందని... ప్రజలు కూడా కుట్రలు పన్నే వారి నైజాన్ని గమనించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకునేలా ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఇది మరపురాని రోజుగా ఉండాలనే నేతన్న సేవలో... పథకాన్ని ప్రారంభించాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాదు... చెప్పని వాటినీ అమలు చేస్తున్నామనడానికి నేతన్న సేవలో పథకమే నిదర్శనం. చేనేత కేవలం ఒక వృత్తే కాదు... భారతీయ సంస్కృతికి ప్రతీక. దేశం గర్వించే కళ చేనేత. మన రాష్ట్రం అనేక చేనేత కళలకు నిలయం. అలాంటి వర్గానికి ఆసరాగా ఉంటున్నాం. చీరాల, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, పొందూరు, పెడన, శ్రీకాళహస్తి, నరసాపురం... ఇలా రాష్ట్రంలో అనేక చేనేత ఉత్పత్తులు విశిష్ట గుర్తింపు పొందాయి. 1.27 లక్షల మంది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. నేతన్న సేవ పథకమే కాదు... ఇప్పటికే నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం కలుగుతోంది. చేనేతలకు 50 ఏళ్లకే ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పెన్షన్ అందిస్తున్నాం. 85 వేల మంది చేనేతలకు ఫించన్‌గా రూ.4 వేల చొప్పున నెలకు రూ.35 కోట్లు ఇస్తున్నాం. రూ.420 కోట్లు ఏడాదికి ఖర్చు పెడుతున్నాం. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్లు ఇచ్చాం. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ.10 కోట్ల వ్యయంతో 10 చేనేత క్లస్టర్లకు ఆమోదం పొందాయి. హ్యాండ్లూమ్ మార్కెటింగ్ అసిస్టెన్స్ కార్యక్రమంతో నేత కార్మికులకు నేరుగా మార్కెట్ అవకాశాలు వచ్చాయి. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం. అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం కూడా వస్తోంది. విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది."అని సీఎం చంద్రబాబు అన్నారు.

### బీసీలకు అండగా...

"బీసీలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోంది. వారి సంక్షేమం కోసం పని చేయడంతోపాటు... రక్షణ కల్పించేందుకు చట్టం చేస్తున్నాం. దీని కోసం ముసాయిదా ఇప్పటికే సిద్ధమైంది. ఇక బీసీల సంక్షేమంలో భాగంగా వివిధ వర్గాలను అన్ని రకాలుగా అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. చేపల వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున రెండేళ్లలో రూ.505 కోట్లు ఇచ్చాం. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయించాం. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు బీసీలకు 3 కిలో వాట్లకు అదనంగా రూ.20 వేలు సబ్సిడీ ఇస్తున్నాం. రాష్ట్రంలో అందరికీ రూ.2.5 లక్షల చొప్పున యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నాం. అభివృద్ధితో పాటు సంక్షేమం, సుపరిపాలనను అందించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. పేదలు భోజనానికి ఇబ్బందులు పడకుండా రూ.5 అన్నా క్యాంటీన్లో భోజనం అందిస్తున్నాం. కొందరు వ్యక్తులు దీనికీ అడ్డం పడి అన్నా క్యాంటీన్లను ఎత్తేశారు. విద్య అందరికీ అందాలన్న లక్ష్యంతో తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ.. వారి తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నాం. సంక్షేమంతో పాటు అభివృద్ధిపైనా శ్రద్ధ పెడుతున్నాం. గత పాలనలో రోడ్లన్నీ గుంతలే. మన రాష్ట్రాన్ని చూసి ఎగతాళి చేశారు... ఇప్పుడు రోడ్లకు మరమ్మత్తులు చేశాం. పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించాం... రూ. 12 లక్షల కోట్ల మేర పెట్టుబడులు ఇప్పటికే గ్రౌండ్ అయ్యాయి. యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తున్నాం... అభివృద్ధి-ఉపాధి కల్పించేలా పారిశ్రామికాభివృద్ధి చేస్తున్నాం. రోడ్లు, పోర్టులు, విమానాశ్రయాలు కూడా రాష్ట్రంలో నిర్మించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. గత పాలకుల నిర్వాకం వల్ల ఆర్థిక ఇబ్బందులున్నా... గడచిన 2 ఏళ్లల్లో పేదలను ఆదుకునేందుకు రూ.1.50 లక్షల కోట్లు సంక్షేమం చేశాం. అభివృద్ధి కోసం 2 ఏళ్లల్లో రూ.1.34 లక్షల కోట్లు ఖర్చు చేశాం. రోడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు.

### మినీ ముంబై చీరాలకు పూర్వవైభవం తెస్తాం"

చీరాల పేరు వింటేనే ఇక్కడి నేతన్నల నైపుణ్యం గుర్తుకు వస్తుంది. చీరాల పట్టు, కాటన్ చీరలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. చీరాల ఖర్చీఫ్‌లు ఒకప్పుడు విదేశాలకు భారీగా ఎగుమతి అయ్యేవి. చేనేత ఉత్పత్తుల్లో ఒకప్పుడు 'మినీ ముంబై'గా పేరొందిన చీరాలకు పూర్వ వైభవం తెస్తాం. పర్యాటకుల్ని ఆకట్టుకునేలా సూర్యలంక, బాపట్ల, చీరాల సముద్ర తీర ప్రాంతాలను తీర్చిదిద్దుతున్నాం. రూ. 97 కోట్ల స్వదేశ్ దర్శన్ నిధులతో సూర్యలంక నుంచి చీరాల వరకు పర్యాటక కారిడార్ ఏర్పాటు చేస్తున్నాం."అని ముఖ్యమంత్రి చెప్పారు. తన ప్రసంగం అనంతరం బాపట్ల జిల్లాలో వివిధ శాఖలకు చెందిన అధికారుల పని తీరుపై తన వద్దనున్న నివేదికను ప్రజలకు చదివి వినిపించారు. చక్కగా పని చేసిన వారిని ప్రజలు అభినందించాలని సూచించారు. సంతృప్తికరంగా పని చేయని అధికారులను పనితీరు మరింత మెరుగు పరుచుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ స్టాళ్లను సీఎం చంద్రబాబు సందర్శించారు. సీబీఎన్ జీవిత చరిత్రను ఆవిష్కరిస్తూ మహతి అనే యువతి 40 పెన్సిళ్లతో రూపొందించిన మైక్రో ఆర్ట్ ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. బాపట్ల, సూర్యలంక సహా జిల్లాలోని వివిధ బీచ్ ల సమాచారాన్ని ప్రజలకు అందించేలా రూపొందించిన బే ఆఫ్ బాపట్ల వెబ్ సైట్, హ్యాండ్ బుక్ ను సీఎం విడుదల చేశారు. బాపట్ల లీప్స్ పేరుతో వివిధ రంగాల్లో యువతకు అందించే శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. చేనేత రంగ అభివృద్ధికి సంబంధించి ఫ్యాబ్ ఇండియా సహా నాలుగు సంస్థలతో సీఎం చంద్రబాబు సమక్షంలో అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, బాపట్ల జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు

## జాబ్ చార్ట్ అమలులో నిర్లక్ష్యానికి ఆస్కారం ఇవ్వకూడదు

- వృత్తిపట్ల నిబద్ధత ఉండాలి, క్రమశిక్షణతో పనిచేయాలి
- నూతన ఆయుష్ వైద్యులకు కమిషనర్ రోణంకి గోపాల్ కృష్ణ హితవు



**విజయవాడ, ఆగస్టు 7 :** నూతనంగా విధుల్లో చేరిన ఆయుష్ వైద్యులు ప్రజాసేవనే పరమావధిగా భావించి, వృత్తిపట్ల పూర్తి నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాల్ కృష్ణ సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా సేవలందించడంతో పాటు ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. నేషనల్ ఆయుష్ మిషన్ (ఎన్ఏఎం - ఔంఒ) ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన హోమియో, యునానీ వైద్యులకు విజయవాడ ఆటోనగర్‌లోని ఆయుష్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమం రెండో రోజు ఆయన మాట్లాడారు. నూతన వైద్యులకు విధులు, బాధ్యతలు, జాబ్ చార్ట్‌పై సమగ్ర అవగాహన కల్పించారు. ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు (ఏహెచ్‌డబ్ల్యూసీ - ంఊచిఅ) నిర్వహణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడం, ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయి-ంలో సమర్థంగా అమలు చేయడం ప్రతి వైద్యుడి బాధ్యత అని చెప్పారు. జాబ్ చార్ట్‌లో నిర్దేశించిన విధులను తప్పనిసరిగా పాటిస్తూ, సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలని సూచించారు. ప్రజారోగ్య కార్యక్రమాలపై శిక్షణశిక్షణలో భాగంగా నేషనల్ ఆయుష్ మిషన్ అమలు మార్గదర్శకాలు, అసాంక్రమిక వ్యాధుల (ఎన్‌సీడీ - ఔఅఞ) స్క్రీనింగ్, ఆయుష్ హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఏహెచ్ఎంఐఎస్ - ంఊఓమో) ద్వారా నివేదికల నమోదు, ప్రజారోగ్య కార్యక్రమాల అమలు తదితర అంశాలపై అధికారులు, నిపుణులు నూతన వైద్యులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం మెడికల్ క్యాంప్ కిట్లను పంపిణీ చేశారు. మూడో రోజు శనివారం బడ్జెట్ కేటాయింపులు, ఆర్థిక నిర్వహణ, నేషనల్ ఆయుష్ మిషన్ పోర్టల్ నిర్వహణ, జిల్లా ఆయుష్ సొసైటీల సమన్వయంపై ప్రత్యేక సదస్సు నిర్వహించి శిక్షణ కార్యక్రమాన్ని ముగించనున్నారు.

## నెరవేర్చిన వృద్ధురాలి ఆకాంక్ష

**చీరాల, ఆగస్టు 7 :** తనను కలవాలన్న 90 ఏళ్ల వృద్ధురాలి ఆకాంక్షను సీఎం చంద్రబాబు నెరవేర్చారు. చీరాలకు చెందిన 90 ఏళ్ల పుష్పావతిని పిలిపించుకుని మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో సీఎం చంద్రబాబును కలిసి ఫోటో దిగాలన్న ఆకాంక్షను వృద్ధురాలు వ్యక్తం చేయగా, ఈ విషయం తన దృష్టికి రావటంతో చీరాలలో కలిసి మాట్లాడతానంటూ ఎక్స్ వేదికగా సీఎం పోస్ట్ చేసారు. ఆ మేరకు చీరాలలో ఆ వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరించి ఫోటో దిగారు. సీఎం చంద్రబాబుతో ఫోటో దిగటంపై వృద్ధురాలు పుష్పావతి అబ్బురపడింది. అలాగే మగ్గంతో వస్త్రంపై తన చిత్రపటాన్ని నేసిన చేనేత కుటుంబం నాగేశ్వరరావు, లక్ష్మీలతో మాట్లాడిన సీఎం ఎంతో నైపుణ్యంతో తన చిత్రపటాన్ని వస్త్రంపై నేసిన చేనేత దంపతులకు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.





## చేనేత కళను పరిరక్షిద్దాం.. చేనేత వస్త్రాలను ధరిద్దాం

**కలెక్టర్ కె. వెట్రిసెల్వి**

**ఏలూరు, ఆగస్టు, 7 :** జాతీయ చేనేత దినోత్సవాన్ని ఏలూరు జిల్లా కలెక్టరేట్ లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్యక్రమాన్ని జ్యోతిని వెలిగించి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి లో భాగమైన చేనేత కళను పరిరక్షించేందుకు ప్రతీ ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి, చేనేత రంగాన్ని బలోపేతం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని, ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయన్నారు. చేనేత కార్మికులకు 50 ఏళ్లకే పెన్షన్ అందిస్తున్నదన్నారు. నేతన్న సేవలో పథకంలో అర్హులైన ప్రతీ చేనేత కార్మికులకు 25 వేల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నాయని, అంతేకాక చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌కు 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తోందన్నారు. చేనేత సహకార సంఘాలకు ప్రత్యేక మౌలిక సదుపాయాలు అందిస్తున్నామన్నారు. చేనేత వస్త్రాలను ధరించడం ద్వారా చేనేత కార్మికులను ప్రోత్సహిస్తూ భారతీయ సంస్కృతి లో భాగమైన చేనేత కళను సంరక్షించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలనీ కలెక్టర్ వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్ ను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో డిఆర్ఓ ఎం. శ్రీదేవి, జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అధికారి కె. అప్పారావు, అభివృద్ధి అధికారి బి. హనుమంతరావు, మేనేజర్ తుమ్మల సుబ్బారావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి విశ్వమోహన్ రెడ్డి,బిసి కార్పొరేషన్ ఈడి పుష్పలత, గృహ నిర్మాణ శాఖ పిడి సత్యనారాయణ, కలెక్టరేట్ ఏఓ నాంచారయ్య, చేనేత సంఘాల ప్రతినిధులు గుంటూరు సత్యవతి, మారకా శివయ్య, పోలిన వీరాస్వామి, దొడ్డిపట్ల కోటిలింగం,, నరుని లక్ష్మారావు, దివి లక్ష్మి, ప్రభృతులు పాల్గొన్నారు.

## వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిపై మంత్రి నిమ్మల సమీక్ష

**విజయవాడ, ఆగస్టు 7 :** ఈఎన్సీ నరసింహమూర్తి, ప్రాజెక్ట్ సిఈ, ఎస్ఈ, ఈఈలు,ఏజెన్సీల ప్రతినిధులతో మంత్రి నిమ్మల రామానాయుడు వెలిగొండ ప్రాజెక్టు పనులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నల్లమల సాగర్ రిజర్వాయర్ కు కృష్ణా జలాల తరలింపుకు తీసుకోవలసిన చర్యలపై సమీక్ష. చేసారు. ఈనెల మూడో వారంలో నల్లమల సాగర్ కు నీళ్ళు తరలించేందుకు సిద్ధంగా, చెక్ మెమో ఇవ్వాలని అధికారులను ఆదేశించిన మంత్రి నిమ్మల కొల్లం వాగు నుండి టన్నెల్స్ ద్వారా, కృష్ణా జలాలు తరలించేందుకు అప్రోచ్ ఛానెల్ క్లియర్ చేయడం జరిగిందని పేర్కొన్నారు.

# ఎస్‌బీఐ లాభం రూ.24,113 కోట్లు



ముంబయి: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రాదీ×) త్రైమాసిక ఫలితాల్లో అదరగొట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదిక రూ.24,113 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే సమయంలో నికర లాభం రూ.21,201.47 కోట్లుగా ఉంది. అంటే ఏడాదితో పోల్చినప్పుడు 13.73 శాతం వృద్ధి నమోదైంది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో నికర లాభం రూ.19,642.87 కోట్లుగా ఉంది. స్టాండలోన్ ప్రాతిపదికన బ్యాంక్ నికర లాభం 10.23 శాతం వృద్ధి చెంది రూ.21,121.22 కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ.19,160.44 కోట్లుగా ఉందని ఎస్‌బీఐ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం గతేడాది రూ.1.35 లక్షల కోట్లుగా ఉండగా.. ఈ ఏడాది రూ.1.43 లక్షల కోట్లకు పెరిగింది. మొత్తం ఖర్చులు సైతం రూ.1.04 లక్షల కోట్ల నుంచి రూ.1.10 లక్షల కోట్లకు పెరిగాయి. నిరర్థక ఆస్తుల కోసం కేటాయించే ప్రొవిజన్లు రూ.4,934 కోట్ల నుంచి రూ.3,359 కోట్లకు తగ్గాయి. నికర ఎన్‌పీల నిష్పత్తి 1.49 శాతం నుంచి 1.47 శాతానికి తగ్గుముఖం పట్టాయి. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఎస్‌బీఐ షేర్లు బీఎస్‌ఈలో 2.13 శాతం లాభంతో రూ.1108 వద్ద ట్రేడవుతున్నాయి.






## డాబర్ ఇండియాకు ఊరట...

### ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ఆదేశాలపై హైకోర్టు స్టే

ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ డాబర్ ఇండియాకు దిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. వంద శాతం స్వచ్ఛత పేరుతో తేనె, ఆవు నెయ్యి, నూనెలు వంటివి విక్రయించొద్దంటూ ఆహార నియంత్రణ సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ జారీ చేసిన నిషేధాజ్ఞలపై హైకోర్టు స్టే విధించింది. విచారణకు అవకాశం లేకుండా నిషేధం విధించడం సరికాదని అభిప్రాయపడింది. తదుపరి విచారణ తేదీ వరకు స్టే ఉత్తర్వులు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఈ కేసు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. తమ ఉత్పత్తులు 100% స్వచ్ఛమైనవని.. ప్రకృతిసిద్ధంగా సమీకరించినవి, స్వచ్ఛతకు హామీ, రసాయన రహితమైనవి అన్న ప్రచారంతో తేనె, ఆవునెయ్యి, వంటనూనెలు, యాపిల్ సైడర్ వెనిగర్, కొబ్బరినూనె, కొబ్బరినీళ్లు, కొబ్బరిపాలు వంటివి విక్రయించొద్దని దిగ్గజ డాబర్ ఇండియాను ఎఫ్ఎస్‌ఎస్ఏఐ ఇటీవల ఆదేశించింది. ఈ ప్రకటనలు వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా ఉందని తెలిపింది. దీనిపై డాబర్ ఇండియా దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు ప్రాథమిక న్యాయ సూత్రాలను ఉల్లంఘించేవిగా ఉన్నాయని డాబర్ ఇండియా తరఫు సీనియర్ న్యాయవాది వాదించారు. కనీసం షోకాజ్ నోటీసులు గానీ, విచారణ గానీ జరగ్గకుండా ఏకపక్షంగా ఆదేశాలు ఇచ్చిందని పేర్కొన్నారు. డాబర్ ఇండియాకు గతంలో నోటీసులు జారీ చేసినట్లు కేంద్రం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణ వరకు నిషేధంపై స్టే విధించింది.

## అందుకే.. హేజిల్‌వుడ్ నాకు బౌలింగ్ చేయనన్నాడు

### ఛెతేశ్వర్ పుజారా



మిస్టర్ 'నయా వాల్' ఛెతేశ్వర్ పుజారాకు ఆస్ట్రేలియా స్టార్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ బౌలింగ్ చేసేందుకు ఆసక్తి చూపించలేదట. వీరిద్దరూ ప్రత్యర్థులుగా దిగిన మ్యాచ్‌లో కాదు సుమా..! పుజారా - జోష్ ఒకే జట్టులో ఉంటూ నెట్స్‌లో సాధన చేసే సమయంలోనే ఇది జరిగింది. ఆ విషయాలను పుజారా ఓ పాడ్‌కాస్ట్‌లో వెల్లడించాడు. పుజారా, జోష్ హేజిల్‌వుడ్ సీఎస్‌కే తరఫున ఐపీఎల్‌లో కలిసి ఆడారు. అంతకుముందు బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో ప్రత్యర్థులుగా బరిలోకి దిగి పోటీపడ్డారు. "2018-19, 2021 ఆస్ట్రేలియాతో జరిగిన సిరీసుల్లో జోష్ హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో చాలా బంతులు ఆడా. ఆ తర్వాత నన్ను ఐపీఎల్‌లో సీఎస్‌కే తీసుకుంది. అప్పటికే జోష్ కూడా చెన్నై జట్టుతోనే ఉన్నాడు. తొలిసారి నేను బ్యాటింగ్ చేసేందుకు నెట్స్‌లోకి వెళ్లా. కానీ, హేజిల్‌వుడ్ నాకు బౌలింగ్ చేసేందుకు విముఖత చూపించాడు. 'అతడికి బౌలింగ్ చేయను' అని అనేశాడు. మేమిద్దరం సహచరులమైనా సరే తిరస్కరించాడు. దానికి కారణం కూడా ఉంది. కొన్ని నెలల ముందే జోష్ బౌలింగ్‌ను ఎదుర్కొన్నా. అందుకే, నాకు బౌలింగ్ చేయకుండా ఆగిపోయినట్లు జోక్ చేశాడు. నెట్స్‌లోనూ ఎప్పుడూ నాకు బౌలింగ్ చేయలేదు" అని పుజారా గుర్తు చేసుకున్నాడు. "నేను కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఐపీఎల్ కెరీర్‌ను ప్రారంభించా. షారుక్ ఖాన్ ఓనర్. తొలిసారి అతడిని కలవడం ఓ అభిమానిగా మరిచిపోలేని క్షణం. అయితే, క్రికెట్ విషయానికొచ్చేసరికి ఆయన మా ఓనర్. ఫ్రాంచైజీ సృష్టించిన వాతావరణం చాలా బాగుంటుంది. గొప్ప ఆటగాళ్లతో కలిసి పనిచేయడం, వారి నుంచి నేర్చుకొనేందుకు వీలుంటుంది. మనలోని క్రికెట్ నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకొనేందుకు సదావకాశం మెరుగుపర్చుకోవచ్చు" అని పుజారా అన్నాడు.

# వార్మప్ మ్యాచ్..

## ప్రభావం చూపించని భారత బౌలర్లు



శ్రీలంక-11తో వార్మప్ మ్యాచ్‌లో భారత బౌలర్లు పెద్దగా ప్రభావం చూపించలేకపోయారు. తొలి రోజు ఆట ముగిసే సరికి శ్రీలంక ఎనిమిది వికెట్ల నష్టానికి 363 పరుగులు చేసింది. క్రీజ్‌లో కేషర నువాంత (9), దిలుమ్ సుదీరా (1) ఉన్నారు. నిషాన్ మదుష్క (66), రవిందు రసాంత (71), సోనాల్ దినుష (51) అర్ధశతకాలతో అలరించారు. పవన్ రత్నాయకే (39), విక్రమసింఘె (31), పసిందు సూరియ బండారా (35) ఫర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా 2, కుల్‌దీప్ యాదవ్ 2, మానవ్ సుతార్ 2, గుర్నూర్ బ్రార్ ఒక వికెట్ తీశారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక జట్టుకు ఓపెనర్లు నిషాన్, రవిందు మంచి ఆరంభం ఇచ్చారు. తొలి వికెట్‌కు 110 పరుగులు జోడించారు. భారత పేస్ బౌలర్లు సిరాజ్, ప్రసిద్ధ్‌కు వికెట్ దక్కలేదు. వీరిద్దరూ 21 ఓవర్లు వేసి 76 పరుగులు ఇచ్చారు. బుమ్రా లేకుండానే శ్రీలంకతో టెస్టు సిరీస్‌ను ఆడనుంది. ఈ క్రమంలో వికెట్ లేకపోవడం భారత శిబిరంలో కాస్త ఆందోళన కలిగించేదే. కొత్త బౌలర్ సారాంశ్ జైన్ (11-0-54-0) కూడా ఇబ్బంది పడ్డాడు. అయితే, కుల్‌దీప్‌తోపాటు జడేజా, సుతార్ నాణ్యమైన బౌలింగ్‌తో వికెట్లు దక్కాయి. వార్మప్ మ్యాచ్ తొలి రోజు ఆటకు భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ దూరంగా ఉన్నాడు. గురువారం ప్రాక్టీస్ చేస్తుండగా చేతి వేలికి గాయమైన సంగతి తెలిసిందే. దీంతో అతడికి బదులు కేఎల్ రాహుల్ సారథ్యం నిర్వర్తించాడు. రెండో రోజు గిల్ ఫిట్‌గా ఉంటే బరిలోకి దిగే అవకాశం ఉంది. అదీ సాధ్యం కాకపోతే.. నేరుగా ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో జరగనున్న తొలి టెస్టులోనే ఆడతాడు.




## పడిన మార్కెట్ సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి కారణంగా సూచీలు నేల చూపులు చూశాయి. సెన్సెక్స్ 455.59 పాయింట్ల నష్టంతో 78,499.17 వద్ద ముగియగా.. నిఫ్టీ 65.35 పాయింట్ల నష్టంతో 24,570.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.20గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, ట్రెంట్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. టీసీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎస్‌బీఐ, టెక్ మహీంద్రా, బీఈఎల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 83 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4300 డాలర్లపైనే కొనసాగుతోంది.



## సన్‌రైజర్స్ ఆటగాళ్లపై ముంబై ఇండియన్స్ కన్ను!

ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ అంచనాలను అందుకోలేకపోయింది. టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ 14 మ్యాచ్‌ల్లో పదింటిలో ఓడి తీవ్రంగా నిరాశపర్చింది. దాంతో పాయింట్స్ టేబుల్‌లో 9వ స్థానంతో సరిపెట్టుకుంది. ఐదు సార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్‌కు ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యమైన ప్రదర్శన కాదు. జట్టు నిండా స్టార్లు ఉన్నా అంచనాలకు తగ్గట్లు రాణించలేకపోయింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ వైఫల్యం ముంబై పతనాన్ని శాసించింది. ఈ ఘోర పరాజయాన్ని సీరియస్‌గా తీసుకున్న ముంబై ఇండియన్స్.. వచ్చే సీజన్‌లో టైటిల్ గెలవడమే లక్ష్యంగా జట్టును సిద్ధం చేస్తోంది. జట్టును వీడాలని నిర్ణయించుకున్న కెప్టెన్ హార్దిక్ పాండ్యాను అడ్డు పెట్టుకొని తమకు కావాల్సిన ఆటగాళ్లను ఇతర జట్ల నుంచి ట్రేడ్ చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు చెందిన ఇషాన్ కిషన్, శివాంగ్ కుమార్ లేదా దేశీయ పేసర్, ఒక ఓవర్‌సీస్ పేసర్‌ను జట్టులోకి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఈ ట్రేడ్ డీల్ గురించి తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా చెప్పడం తీవ్ర చర్చనీయాంశమైంది. 'సీఎస్‌కే, కేకేఆర్ కాకుండా ముంబై ఇండియన్స్ ఇతర జట్ల వైపు కూడా చూడవచ్చు. హార్దిక్ పాండ్యాకు బదులుగా ఒక భారతీయ బ్యాటర్, ఒక విదేశీ/భారతీయ బౌలర్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ముంబై డీల్‌కు ప్రయత్నించవచ్చు. గతంలో ముంబై ఆటగాడిగా ఉన్న ఇషాన్ కిషన్‌ను హార్దిక్ పాండ్యాకు బదులుగా వారు అడగవచ్చు. ఇషాన్ కిషన్, శివాంగ్ కుమార్ లాంటి ఆటగాడు వస్తే హార్దిక్ పాండ్యాకు సమాన విలువ లభిస్తుంది.'అని అశ్విన్ పేర్కొన్నాడు. అయితే అశ్విన్ చెప్పిన మాటలు వాస్తవమేనని పలువురు క్రికెట్ పండిట్స్ అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ముంబై ఇండియన్స్‌కు ఇషాన్ కిషన్ వంటి ఇండియన్ టాపార్డర్ బ్యాటర్ అవసరం ఉంది. అలాగే శివాంగ్ కుమార్ వంటి స్పిన్నర్‌తో పాటు ఓవర్‌సీస్ పేసర్, ఇండియన్ పేసర్ కూడా కావాలి. హార్దిక్ పాండ్యాను అడ్డు పెట్టి తమకు కావాల్సిన ఆటగాళ్ల కోసం ముంబై.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో సంప్రదింపులు జరపవచ్చు. అంతేకాకుండా ఇషాన్ కిషన్ గతంలో ముంబై ఇండియన్స్‌కు మెరుగ్గా ఆడాడు. ప్రస్తుతం అతను సూపర్ ఫామ్‌లో ఉండటమే కాకుండా ఇండియన్ ఐకాన్ ప్లేయర్‌గా ఎదుగుతున్నాడు. కాబట్టి అతని కోసం ముంబై గట్టిగా ప్రయత్నించే అవకాశం ఉంది. అయితే ఈ డీల్‌కు కావ్యమారన్ నేతృత్వంలోని సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ అంగీకరించపో వచ్చని ఆ జట్టు ఫ్యాన్స్ అంటున్నాడు. నితీష్ రెడ్డి రూపంలో జట్టులో మంచి పేస్ ఆల్‌రౌండర్ ఉన్నాడని, హార్దిక్ పాండ్యా కోసం ఇషాన్ కిషన్ వంటి కీలక బ్యాటర్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ వదులుకోదని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## ముంబై ఇండియన్స్‌కు సూర్యకుమార్ గుడ్ బై!



ముంబై ఇండియన్స్ స్టార్ ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ ఆ జట్టు వీడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే అతను జట్టు నుంచి తప్పుకోనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే ఆ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యా.. టీమ్‌లో కొనసాగలేనని సమాచారమిచ్చినట్లు వార్తలు వచ్చాయి. హార్దిక్ పాండ్యాను ఇతర జట్టుకు ట్రేడింగ్ చేసి తమకు కావాల్సిన ఆటగాళ్లను తీసుకోవాలనే యోచనలో ముంబై ఇండియన్స్ ఉంది. ఇప్పటికే సీఎస్‌కే, కేకేఆర్, సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్‌తో హార్దిక్ పాండ్యా ట్రేడ్ డీల్‌కు సంబంధించి ముంబై ఇండియన్స్ సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే హార్దిక్ పాండ్యా ట్రేడ్ డీల్ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇది ఇలా ఉండగానే సూర్యకుమార్ యాదవ్ ట్రేడ్ డీల్ వార్తలు కూడా తెరపైకి వచ్చాయి. ముంబై ఇండియన్స్ జట్టులో కొనసాగేందుకు సూర్యకుమార్ యాదవ్ సుముఖంగా లేడని, అతన్ని లక్నో సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ చేసేందుకు ప్రయత్నాలు జరిగాయని తెలుస్తోంది. అయితే లక్నో జట్టులో చేరేందుకు సూర్య విముఖత చూపినట్లు సమాచారం. ముంబై ఇండియన్స్ నుంచి అతని నిష్క్రమణ ఖాయమైనప్పటికీ.. అతను ఏ జట్టులో చేరుతాడనేది ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ పేలవ ప్రదర్శన కనబర్చింది. 14 మ్యాచ్‌ల్లో పదింటిలో ఓడి పాయింట్స్ టేబుల్‌లో 9వ స్థానంలో నిలిచింది. సూర్యకుమార్ యాదవ్ తీవ్రంగా నిరాశపర్చాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో 16 మ్యాచ్‌ల్లో 717 పరుగులు చేసిన సూర్య.. 2026 సీజన్‌లో మాత్రం 13 మ్యాచ్‌ల్లో 2 హాఫ్ సెంచరీలతో 270 పరుగులే చేశాడు. అతని పేలవ ఫామ్ ముంబై విజయవకాశాలను దెబ్బతీసింది. ఈ నేపథ్యంలోనే సూర్యతో పాటు పలువురు కీలక ఆటగాళ్లను తొలగించాలని ముంబై మేనేజ్‌మెంట్ నిర్ణయించింది. హార్దిక్ పాండ్యాను కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ట్రేడ్ చేసేందుకు చర్చలు జరుగుతుండగా.. సూర్య ట్రేడ్ డీల్‌పై క్లారిటీ లేదు. అయితే సూర్య నిష్క్రమణపై ముంబై ఇండియన్స్ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. పేలవ బ్యాటింగ్ ప్రదర్శనతో సూర్య.. టీమిండియా టీ20 కెప్టెన్సీతో పాటు జట్టులో కూడా చోటు కోల్పోయాడు.



## గూగుల్ మ్యాప్స్‌లో ఇక ఫుడ్ ఆర్డర్, హోటల్ సెర్చ్!

గూగుల్ మ్యాప్స్ కొత్త రూపు సంతరించుకుంటోంది. ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లు జోడించుకుంటూ వినియోగదారులకు మరింత చేరువవుతోంది. కేవలం దారి చూపించే సాధనంగానే కాకుండా ఇకపై ఫుడ్ ఆర్డర్, హోటల్ సెర్చ్ వంటివీ చేయొచ్చు. 'ఆస్క్ మ్యాప్స్' పేరిట ఈ మేరకు కొన్ని సదుపాయాలను జోడించినట్లు గూగుల్ తన బ్లాగ్ పోస్ట్‌లో పేర్కొంది.

గూగుల్ మ్యాప్స్‌లో కొత్త ఫీచర్లు ఇవీ..

- ఏదైనా కొత్త ప్రదేశానికి వెళ్లినప్పుడు అక్కడ ఏదైనా తినాలనిపిస్తే వేరేగా రెస్టరంట్ల కోసం వెతికే పని లేకుండా ఆస్క్ మ్యాప్స్‌లోనే ఈ సదుపాయం పొందొచ్చు. మీకు కావాల్సిన రెస్టరంట్లను వెతకడం, కావాల్సిన వంటకాలను నేరుగా కార్ట్‌కు యాడ్ చేయడం వంటివి చేయొచ్చు. ఇదే తరహాలో హోటళ్లు వెతకడం, కాన్సర్టులు, కామెడీ షోలకు టికెట్ బుకింగ్‌కు సంబంధించిన లింకులూ పొందొచ్చు.
- మీ జీమెయిల్‌లో ఉన్న ప్రయాణ వివరాలను (ఫ్లైట్ టికెట్లు, హోటల్ బుకింగ్‌లు) అనుసంధానించుకుని, దానికి తగిన విధంగా ప్రయాణ సూచనలు పొందొచ్చు. గూగుల్ మ్యాప్స్ ఇకపై మీ పాత సంభాషణలనూ గుర్తుంచుకుంటుంది. కాబట్టి ప్రయాణ ప్లానింగ్‌ను గతంలో ఎక్కడ ఆపారో అక్కడి నుంచే కొనసాగించవచ్చు. బస్సులు, మెట్రో, రైళ్లు, ఫెర్రీల వివరాలను లైవ్‌లో తెలుసుకునే సౌకర్యమూ తీసుకొచ్చారు.
- భారత్‌లో ఇంగ్లిష్‌లోనే కాకుండా హిందీలోనూ ఆస్క్ మ్యాప్స్‌లో ప్రశ్నలు అడిగి హోటళ్లు, రెస్టారెంట్లు, పర్యాటక ప్రాంతాల వివరాలు తెలుసుకోవచ్చు. భారత్, అమెరికా సహా 150కి పైగా దేశాల్లో ఈ సదుపాయాలను రోల్ అవుట్ చేసింది. ఫుడ్ ఆర్డర్, ఈవెంట్ సెర్చ్ ఫీచర్లు ప్రస్తుతానికి అమెరికాలో అందుబాటులోకి వచ్చాయి. దశలవారీగా ఇతర దేశాల్లోనూ తేనున్నారు.

## తలుపు వేసి ఉంటే ఎవరికీ ఎంట్రీ లేదు

### ధోనీ రూమ్ రూల్ చెప్పిన అజింక్య రహానే



భారత క్రికెట్ చరిత్రలో ఎంఎస్ ధోనీ సృష్టించిన ఇంపాక్ట్ మరువలేనిది. మైదానంలో ఎంతో ప్రశాంతంగా ఉండే ధోనీ, మైదానం వెలుపల కూడా యువ ఆటగాళ్లకు సలహాలు సూచనలు ఇస్తుంటాడు. విదేశీ టూర్లు లేదా ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో జాతీయ, అంతర్జాతీయ ఆటగాళ్లు స్వేచ్ఛగా వచ్చి మాట్లాడటానికి, అతడి రూమ్ ఒక అడ్డాగా మారేది. ఈ క్రమంలో టీమిండియాతో పాటు చెన్నై సూపర్ కింగ్స్, రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్ జట్ల తరఫున ధోనీతో కలిసి ఆడిన అజింక్య రహానే ఆయన రూమ్ కల్చర్ గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'ఓవర్‌ల్యాప్ క్రికెట్' యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన రహానే, ధోనీ ఎంతో ప్రశాంతమైన, సాధారణమైన మనిషి అని కొనియాడాడు. "హోటల్‌లో ఆయన గది తలుపులు దాదాపు 24 గంటలూ తెరిచే ఉండేవి. జట్టులోని 10 నుంచి 15 మంది ఆటగాళ్లు, ఒక్కోసారి జట్టు మొత్తం ఆయన గదిలోనే గడిపేవారు. అయితే అక్కడ అందరూ తప్పక పాటించాల్సిన ఒకే ఒక నిబంధన ఉంది. అదేమిటంటే ధోనీ రూమ్ డోర్ క్లోజ్ చేసి ఉంటే, ఎవరూ లోపలికి వెళ్లడానికి అనుమతి ఉండదు. ఇది పేపర్‌పై రాయని ఓ రూల్" అని రహానే వెల్లడించాడు. మరోవైపు, కాలి గాయం కారణంగా ఎంఎస్ ధోనీ ఐపీఎల్ 2026 సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. 40 ఏళ్లు పైబడ్డ ధోనీ ఐపీఎల్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడంతో అతడి భవిష్యత్తు క్రికెట్ కెరీర్‌పై సందేహాలు నెలకున్నాయి. 2011 నుంచి 2023 మధ్య కాలంలో రహానే 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. జట్టు సాధించిన పలు చారిత్రాత్మక విజయాల్లో కీలక పాత్ర పోషించాడు.



# 'వారణాసి' వీడియో లీక్..

దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న వారణాసి సినిమాకు లీకులు బెడద ఎక్కువగానే ఉంటున్నది. ఈ సినిమా కోసం భారీ సెట్స్ వేసి.. పకడ్బందీగా సన్నివేశాలు చిత్రీకరిస్తున్నప్పటికీ.. ఈ సినిమా కోసం షూట్ చేస్తున్న కీలక సన్నివేశాలను కొందరు నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టు చేసి లీక్ చేస్తున్నారు. ఈ లీకుల బెడదతో చిత్ర యూనిట్ ఆందోళనకు గురి అవుతున్నట్టు సమాచారం. వారణాసి సినిమా షూటింగును ఒడిశాలోని ఓ మారుమూల ప్రాంతంలో చిత్రీకరించారు. అయితే కెమెరాకు అందని దూరంలో ఉన్న సన్నివేశాలను షూట్ చేసి వాటిని కొందరు లీక్ చేశారు. ఇక ఈ సినిమా గ్లింప్స్ రిలీజ్ సమయంలో రామోజీ ఫిలిం సిటీలో పకడ్బందీగా ఏర్పాటు చేసిన వేదిక నుంచి దొంగచాటుగా షూట్ చేసి లీక్ చేశారు. గ్లింప్స్‌ను అధికారికంగా రిలీజ్ చేయడానికి ముందే అది సోషల్ మీడియాలో విడుదల కావడం షాకిచ్చింది.

# 'ది ప్యారడైజ్' టీజర్ విడుదల

టాలీవుడ్ హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' సినిమా నుంచి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న టీజర్ విడుదలైంది. షూటింగ్ చివరి దశకు చేరుకున్న వేళ వచ్చిన ఈ టీజర్ సోషల్ మీడియాలో మంచి స్పందన అందుకుంటోంది. టీజర్‌లో నాని ఇప్పటివరకు కనిపించని మాస్ లుక్‌లో కనిపించారు. యాక్షన్ సన్నివేశాలు సినిమాపై అంచనాలను మరింత పెంచేలా ఉన్నాయి. చేతి నిండా బ్లేడ్లు పట్టుకుని కనిపించే సన్నివేశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'దిష్టంతా పోవాలే' అంటూ నాని చెప్పిన డైలాగ్ అభిమానులను బాగా ఆకట్టుకుంటోంది. టీజర్‌కు అనిరుధ్ అందించిన నేపథ్య సంగీతం మరో హైలెట్‌గా నిలిచింది. ప్రతి యాక్షన్ సీన్‌కు తగ్గట్టుగా వచ్చిన బీజీఎం టీజర్‌కు మరింత బలం తీసుకొచ్చింది. విజువల్స్ కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ సినిమాలో నాని సరసన కాయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్నారు. టీజర్‌కు వస్తున్న స్పందనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'ది ప్యారడైజ్' వచ్చే నెల 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.



# 'కొరియన్ కనకరాజు'కు అదిరిపోయే ఆరంభం




వరుణ్ తేజ్ హీరోగా నటించిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద శుభారంభం చేసింది. వినూత్నమైన ప్రచారంతో విడుదలకు ముందే మంచి హైప్ సంపాదించుకున్న ఈ చిత్రం, ఇప్పుడు బలమైన అడ్వాన్స్ బుకింగ్స్, ప్రీమియర్ షోల నుంచి వచ్చిన మంచి టాక్‌తో మంచి వసూళ్ల దిశగా దూసుకెళతోంది. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ కెరీర్‌కు ఈ సినిమా విజయం అత్యంత కీలకంగా మారింది. సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తికి అడ్వాన్స్ బుకింగ్స్ అద్దం పట్టాయి. ముఖ్యంగా చివరి 24 గంటల్లో టికెట్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో మాత్రమే సుమారు 33 వేలకు పైగా టికెట్లు అమ్ముడవడం విశేషం. దీనికి తోడు విడుదలకు ముందు రోజు హైదరాబాద్ సహా పలు నగరాల్లో ఏర్పాటు చేసిన పెయిడ్ ప్రీమియర్ షోలకు అద్భుతమైన స్పందన లభించింది. చాలా షోలు హౌస్‌ఫుల్ కాగా, సినిమా చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియా వేదికగా ప్రశంసలు కురిపిస్తున్నారు. ముఖ్యంగా వరుణ్ తేజ్ కామెడీ టైమింగ్, ఆయన నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. సినిమాలోని కొన్ని కామెడీ సన్నివేశాలు థియేటర్లలో కడుపుబ్బా నవ్విస్తున్నాయని, హారర్‌తో కూడిన వినోదం బాగా వర్కౌట్ అయిందని పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ వస్తోంది. ప్రమోషన్ల సమయంలో వరుణ్ తేజ్ వ్యక్తం చేసిన ధీమాకు తగ్గట్టుగానే సినిమా ఉందని ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద పెద్ద సినిమాల నుంచి గట్టి పోటీ లేకపోవడం కూడా 'కొరియన్ కనకరాజు'కు కలిసొచ్చే అంశంగా ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ సానుకూల పరిస్థితుల్లో తొలి వారాంతంలో సినిమా భారీ వసూళ్లను నమోదు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మొత్తంగా మంచి బజ్, పాజిటివ్ టాక్‌తో మొదలైన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు చాలా కాలంగా ఎదురుచూస్తున్న విజయాన్ని అందిస్తుందో లేదో చూడాలి.

# నానికి జోడీగా భాగ్యశ్రీ బోర్సే!

అక్కినేని అఖిల్ హీరోగా నటించిన 'లెనిన్' మూవీలో హీరోయిన్‌గా చేసి సరికొత్త విజయాన్ని అందుకోవడమే కాకుండా, తన గ్లామర్ అండ్ యాక్టింగ్‌తో కుర్రకారు గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే. ఈ ఒక్క సక్సెస్‌తో ఆమెకు సౌత్ ఇండస్ట్రీలో డిమాండ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. ప్రస్తుతం తమిళంలో శివకార్తికేయన్‌తో 'సెయాన్' సినిమా చేస్తున్న ఈ బ్యూటీ ఖాతాలోకి ఓ బంపర్ ఆఫర్ పడినట్లు టాక్. నేచురల్ స్టార్ నాని హీరోగా, విలక్షణ దర్శకుడు సుజీత్ కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవైటెడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామా 'బ్లడీ రోమియో'లో నానికి జోడీగా నటించేందుకు భాగ్యశ్రీ బోర్సేను చిత్రబృందం సంప్రదించినట్లు వార్తలు వస్తున్నాయి. సుజీత్ రాసుకున్న విభిన్నమైన కథ, తన పాత్ర నచ్చడంతో భాగ్యశ్రీ కూడా ఈ బిగ్ ప్రాజెక్ట్‌లో భాగమయ్యేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మాత వెంకట్ బోయినపల్లి ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గతంలోనే పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ షూటింగ్ ఇంకా ప్రారంభం కాలేదు. కానీ, త్వరలోనే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్‌ను పట్టాలెక్కించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. నాని–సుజీత్ కలయికలో వస్తున్న ఈ యాక్షన్ డ్రామాపై ఇండస్ట్రీలో ఇప్పటికే భారీ అంచనాలు ఉండటంతో, ఈ సినిమా అప్‌డేట్స్ కోసం అభిమానులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.



# ఓటీటీలోకి జన నాయగన్



తమిళనాడు ముఖ్యమంత్రి, కోలీవుడ్ సూపర్ స్టార్ దళపతి విజయ్ నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్' (తెలుగులో 'జన నాయకుడు'). రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో అడుగుపెట్టడానికి ముందు విజయ్ నటించిన సినిమా కావడంతో, మొదటి నుంచి ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. వాస్తవానికి ఈ ఏడాది సంక్రాంతికి విడుదల కావాల్సిన ఈ సినిమా సెన్సార్ వివాదాలు, తదితర కారణాల వల్ల పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు అన్ని అడ్డంకులను దాటుకుని జూలై 23న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదలైంది. మొదటి షో నుంచే మిక్స్‌డ్ టాక్ సొంతం చేసుకున్నప్పటికీ, విజయ్ క్రేజ్ కారణంగా ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద చెప్పుకోదగిన కలెక్షన్స్ రాబట్టింది. ఇప్పుడీ సినిమా ఓటీటీ ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అయింది. 'జన నాయగన్' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'జీ5' ఫ్యాన్సీ రేటుకు దక్కించుకుంది. లేటెస్ట్ రిపోర్ట్స్ మేరకు, ఈ సినిమా ఆగస్టు 21వ తేదీ నుంచి జీ5 లో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. ఒరిజినల్ తమిళ వెర్షన్‌తో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి ఈ చిత్రాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. త్వరలోనే దీనిపై ఓటీటీ సంస్థ నుంచి అధికారిక ప్రకటన రానుంది. మాస్ చిత్రాల దర్శకుడు హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ యాక్షన్ డ్రామాను కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ దాదాపు రూ.500 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, మమితా బైజు ఒక ముఖ్యమైన పాత్రలో ఆకట్టుకుంది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ పవర్‌ఫుల్ విలన్‌గా మెప్పించారు. వీరితో పాటు ప్రకాష్ రాజ్, ప్రియమణి, గౌతమ్ వాసుదేవ్ మీనన్, నాజర్, నరైన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందించారు.



# కీర్తి, ప్రఖ్యాతలను సాధించే క్రమంలో స్వేచ్ఛను కోల్పోవాల్సి వస్తుంది : రాశీ ఖన్నా

విజయాలు లేక కాస్త వెనకబడిన యంగ్ బ్యూటీ రాశీ ఖన్నాకు ఒక్కసారిగా బంపర్ ఆఫర్ తగిలిన విషయం తెలిసిందే. సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ధర్మన్'లో ఆమెకు హీరోయిన్‌గా నటించే గోల్డెన్ ఛాన్స్ దక్కింది. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో సీనియర్ నటి సిమ్రాన్ కూడా కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ లుక్ విడుదలవుతూనే నెట్టింట భారీ హైప్ క్రియేట్ చేయగా, తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న రాశీ ఖన్నా రజినీకాంత్‌తో తనకున్న అనుబంధాన్ని, సెట్స్‌లో ఆయనతో జరిపిన ఆసక్తికర సంభాషణలను పంచుకున్నారు. ఈ సినిమాలో తన పాత్ర స్వభావం గురించి, రజినీకాంత్‌తో కలిసి పనిచేసిన అద్భుతమైన అనుభవం గురించి మాట్లాడుతూ.. ఈ చిత్రంలో తన పాత్ర కథకు భావోద్వేగపరంగా కేంద్రంగా ఉంటుందని ఆమె తెలిపారు. రజినీకాంత్ పోషిస్తున్న ధర్మన్ పాత్రను ఒక మంచి వ్యక్తిగా తీర్చిదిద్దడంలో తన పాత్ర ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని స్పష్టం చేశారు. దర్శకుడు అశ్వత్ తనకు ఈ కథ చెప్పినప్పుడు వెంటనే బాగా నచ్చేసిందని, కథలో ఎంతో హృదయపూర్వకమైన ఎమోషన్ ఉందని రాశీ ఖన్నా చెప్పారు. దానికితోడు రజినీకాంత్ వంటి లెజెండరీ నటుడితో కలసి స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం రావడంతో తాను ఎంతో సంతోషంగా ఒకే చెప్పినట్లు పేర్కొన్నారు. రజినీకాంత్ సెట్స్‌లో చూపించే వినయం, కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఆసక్తి తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని రాశీ ఖన్నా తెలిపారు. నటులు ఒక రకంగా ఖైదీల లాంటి వారని రజినీ సర్ చెప్పిన ఒక మాట తన మనసులో బాగా నాటుకుపోయిందని ఆమె అన్నారు. కీర్తి, ప్రఖ్యాతలను సాధించే క్రమంలో నటులు తమ జీవితంలోని కొంత స్వేచ్ఛను కోల్పోవలసి వస్తుందనే విషయాన్ని ఆయన మాటల ద్వారా తెలుసుకున్నానని వివరించారు.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com